
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శనివారం 30 ఆగస్టు 2025



ఆప్షన్ ఫాం ఇవ్వడానికి డీపీఓ కార్యాలయానికి వచ్చిన ఉద్యోగులు (ఫైల్)

కోరుకొన్న ప్లేస్..!

డీపీఓలో వసూళ్ల పర్వం

- బదిలీల్లో దగ్గరి స్థానాలకు లక్షల్లో వసూలు
- ఎక్కువ ఇచ్చుకున్న వారికే అవకాశం
- ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్ల బరితెగింపు
- ఉన్నతాధికారుల మౌనంపై విమర్శలు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయం(డీపీఓ)లో బదిలీల్లో వసూళ్ల పర్వానికి తెరలేపారు. కోరుకున్న స్థానం కావాలంటే లక్షల రూపాయలు ఇచ్చుకోవాల్సిందే. అది కూడా (మిగతా 6లో..)

విషాహారం తయార్..!



తెరుచుకున్న అరబిక్ రెస్టారెంట్

కదిరిలో పలు రెస్టారెంట్లు, హోటళ్లలో నాణ్యతకు తిలోదకాలు

- కుళ్లిపోయిన మాంసంతో వంటకాలు
- శాకాహారం పరిస్థితీ అంతే..
- అపరిశుభ్రంగా వంటగదులు
- తనిఖీలు మరిచిన అధికారులు..
- అప్పుడే తెరుచుకున్న అరబిక్ రెస్టారెంట్

పలు హోటళ్లు, రెస్టారెంట్లలో
నాణ్యతకు తిలోదకాలిచ్చారు..
ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు..
కుళ్లిపోయి, పురుగులు పట్టిన
మాంసాన్ని వండి పెడుతున్నారు..
పాడైపోయిన కూరగాయలు వాడుతున్నారు..
వంట గదులు అత్యంత
అపరిశుభ్రంగా ఉంటున్నాయి..
నిర్వాహకులు ఇష్టారాజ్యంగా చేస్తున్నా..
అధికారులు కళ్లు మూసుకున్నారు..
ఒకవేళ తనిఖీలు చేసినా..
చర్యలు మాత్రం అంతంతే..
కదిరిలోని అరబిక్ రెస్టారెంటే ఇందుకు నిదర్శనం..
కుళ్లిపోయిన ఆహార పదార్థాలు
పట్టుబడడంతో రెస్టారెంట్‌ను సీజ్ చేశారు..
రోజులు తిరక్కుండానే.. అది తెరుచుకుంది..

కదిరి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లు అంటే ప్రజలు భయపడుతున్నారు. బయటకు అందంగా కనిపించినా వంట గదులు, అత్యంత అపరిశుభ్రంగా ఉంటున్నాయి. వంటకాల్లో కుళ్లిన కూరగాయలు, పురుగులు పట్టిన మాంసాన్ని వేడి చేసి హోటల్‌కు వచ్చిన వినియోగదారులకు వడ్డిస్తున్నారు. చివరకు కొంతమంది తిని పడేసిన ఆహార పదార్థాలను కూడా వడ్డిస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో బహిర్గతమైంది. వంటగదులు ఒక్కసారి చూస్తే మరెపుడూ హోటళ్లలో తినకూడదనే విధంగా ఉన్నాయి.

ఏ ఒక్క రెస్టారెంట్‌లోగానీ, హోటల్‌లోగానీ ఓపెన్ కిచెన్ ఉండడం లేదు. ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. కొన్ని హోటళ్లలో ఆహారాన్ని నిల్వ చేయడానికి ప్రత్యేకంగా ఫ్రిడ్జ్‌లను ఏర్పాటు చేసుకున్నారు. వాటిల్లో రోజుల తరబడి నిల్వ ఉంచి వాటినే హోటల్‌కు వచ్చిన వారికి పెడుతున్నారు. కొన్ని హోటళ్లు మినీ బార్లుగా నడుస్తున్నాయి. వాటిపై చర్యలు తీసుకునేవారు కరువయ్యారు.

అపరిశుభ్రంగా వంటగదులు

పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో వంటగదులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడా ఓపెన్ కిచెన్లు లేవు. అన్నీ లోపలే వండి, తెచ్చి ఇస్తుంటారు. అ వంటగదులు, వండేవారు ఎంత శుభ్రంగా ఉంటారో వేరే చెప్పక్కర్లేదు. సాధారణంగా ఆర్డర్ ఇచ్చిన పదార్థాలను తీసుకొచ్చే సర్వర్లు, టేబుళ్లను శుభ్రం చేసే క్లీనర్లు వేర్వేరుగా ఉంటారు. పట్టణంలోని పలు హోటళ్లలో మాత్రం సర్వర్లు, క్లీనర్లు అన్నీ వారే. వంట కూడా వారే వండుతారు. చేతులు శుభ్రంగా కొడుక్కోకుండానే ఆహార పదార్థాలను సప్లయ్ చేస్తుంటారు. కస్టమర్లు కూడా అంత గమనించరు. గమనించినా ఎందుకులే అనుకుని వెళ్లి పోతుంటారు. ప్రశ్నిస్తే 'ఇష్టముంటే తిను, లేదంటే వెళ్లిపో' అని హోటళ్ల నిర్వాహకులు అంటున్నారు.

నిల్వ ఆహారమే దిక్కు

పట్టణంలో అధికారిక లెక్క ప్రకారం 87 మాంసాహార హోటళ్లు, 272 టీ దుకాణాలు, 156 చికెన్ షాప్‌లు ఉన్నాయి. మాంసాహారపు హోటళ్లు అన్నింటిలోనూ ఫ్రిడ్జ్‌ల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలతోపాటు చికెన్, మటన్, ఫిష్ తదితరాలను నిల్వ ఉంచుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. పట్టణంలో అనేక ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఖర్చు కాని ఆహార పదార్థాలను మరుసటిరోజు కస్టమర్లకు పెడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదకరమైన రసాయనాలు సైతం వాడుతున్నారు. అటువంటి వారికి ఇప్పటికే మున్సిపల్ సిబ్బంది హెచ్చరికలు చేసినట్లు తెలిసింది. చికెన్ సెంటర్లలో కూడా అదే పరిస్థితి. మిగిలిపోయిన చికెన్‌ను మరుసటి రోజు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. నిల్వ ఆహారం అమ్మితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అలా మూశారు.. ఇలా తెరిచారు..

పట్టణంలోని అరబిక్ రెస్టారెంట్‌లో వారం కిందట మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తనిఖీలు చేశారు. కుళ్లిపోయిన మాంసం, ఎంగిలి బిర్యానీ, పాడైపోయిన ఇతర ఆహార పదార్థాలను గుర్తించారు. వెంటనే రెస్టారెంట్‌ను మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఆ మరుసటి రోజు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు వచ్చి ఆహార పదార్థాల శాంపిళ్లు తీసుకెళ్లారు. తరువాత రెస్టారెంట్ యథాతథంగా తెరుచుకుంది. అంతమాత్రానికేనా ఇంత హడావుడి అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎందుకు మూశారు.. ఎందుకు తెరిచారన్న సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

లక్ష రూపాయల ఫైన్ వేశాం



అరబిక్ రెస్టారెంట్‌లో అపరిశుభ్రతపై యజమానికి లక్ష రూపాయల జరిమానా విధించాం. శుక్రవారానికి చెల్లించాల్సి ఉంది. కట్టకపోవడంతో రెండో నోటీసు జారీ చేస్తున్నాం. దానికీ స్పందించకపోతే చర్యలు తీసుకుంటాం. రెస్టారెంట్‌లోని ఆహార పదార్థాల శాంపిళ్లను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సేకరించి, హైదారాబాద్‌లోని ల్యాబ్‌కు పంపారు. ఫలితాలు వచ్చే వరకు రెస్టారెంట్‌పై చర్యలు తీసుకోమని తెలిపారు. వారం సమయం పట్టవచ్చు. హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రత పాటించాలి. ఆహార నాణ్యత సర్టిఫికెట్ కలిగి ఉండాలి.

-కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

కుళ్లిన మాంసం, కూరగాయలు..

పట్టణంలోని కొన్ని రెస్టారెంట్లలో కుళ్లిపోయిన మాంసం, కూరగాయలు వేసి వండుతున్నట్లు ఇటీవల అధికారుల తనిఖీల్లో బయటపడింది. బైపాస్ రోడ్డులో ఉన్న అరబిక్ రెస్టారెంట్‌లో ఇటీవల అధికారులు దాడులు చేశారు. ఆ సమయంలో రెస్టారెంట్‌లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఫ్రిడ్జ్‌ల్లో కేజీల కొద్దీ నిల్వ ఉంచిన చికెన్ ఇతర ఆహార పదార్థాలు బయటపడ్డాయి. ఫ్రిడ్జ్‌ల్లో అవి ఎన్ని రోజుల కిందట ఉంచారోగానీ మంచుగడ్డలుగా మారిపోయి బయటకు తీయడానికి కూడా వీలు లేకుండా తయారయ్యాయి. మసాలాలు కంపు కొడుతున్నాయి. ముందురోజు రాత్రి తినగా మిగిలిన బిర్యానీని ఒక పాత్రలో నిల్వ చేశారు. మరుసటి రోజు వచ్చే వినియోదారులకు పెట్టడానికి వాటిని సిద్ధం చేయడం కనిపించింది. మురుగునీటి కాలువ పక్కనే తందూరి చికెన్ సిద్ధం చేసిన కడ్డీలను ఉంచారు. ఇలా వంట గది అంతా అపరిశుభ్రంగా కనిపించింది. పట్టణంలోని పలు రెస్టారెంట్లలో ఇదే పరిస్థితి నెలకొంది. బైపాస్ రోడ్డులో పేరు మోసిన రెస్టారెంట్‌లో కూడా ఇదే విధంగా నిల్వ ఉంచిన ఆహారాన్ని వండి వడ్డిస్తున్నారని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. హోటల్‌కు వచ్చిన కస్టమర్లు తినే సమయంలో అన్నంలో రాగివైర్లు, బొద్దింకలు వచ్చిన సందర్భాలు అనేకం. కొన్నిమార్లు కుళ్లిన మాంసాన్ని వేడి చేసి తెచ్చినా వాటి వాసన పోదు. దీనిని గుర్తించి కస్టమర్లు తిప్పి పంపుతుంటారు కూడా.

మెరుగైన వైద్యసేవలు అందించండి

- కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశాలు
- ధర్మవరం ప్రభుత్వాస్పత్రి తనిఖీ



ఎన్టీఆర్ వైద్యసేవ కౌంటర్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ధర్మవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ శుక్రవారం తనిఖీచేశారు. ఆస్పత్రిలో పలు వార్డుల్లో కలియ తిరిగారు. వైద్య సేవల గురించి రోగులను అడిగితెలుసుకున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ కౌంటర్‌ను తనిఖీ చేసి, పలు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యం చాలా కీలకమన్నారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో 100 పడకల సదుపాయం ఉన్న నేపథ్యంలో ఓపీ విభాగం మరింత విశాలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేశ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

నేడు బార్ లాటరీ

- అనంతలో 19కిగానూ పదింటికే దరఖాస్తులు
- శ్రీసత్యసాయి జిల్లాలో 12 బార్లలో ఏడింటికే..
- కలెక్టర్ల సమక్షంలో నేడు లక్కీడ్రా ద్వారా కేటాయింపులు

(వివరాలు 6లో...)

సినిమా కథలా..

- ముందుకు సాగని ఎస్‌బీఐ చోరీ కేసు దర్యాప్తు
- దుండగుల కోసం గాలింపు తీవ్రతరం
- ఇప్పటి వరకు ఒకరి అరెస్ట్.. రిమాండ్
- ఖాకీ సినిమాని తలపిస్తున్న నిందితుల చరిత్ర



చోరీ జరిగిన తూమకుంట ఎస్‌బీఐ శాఖ

హిందూపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సంచలనం రేకెత్తించిన తూమకుంట ఎస్‌బీఐ బ్యాంక్ దోపిడీ కేసులో పోలీసుల కృషి ఫలించేనా అన్న అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. గతనెల 26 రాత్రి హరియాణా, రాజస్థాన్‌కు చెందిన దొంగలు సుమారు రూ.10కోట్ల విలువైన 11.5 కిలోల బంగారాన్ని బ్యాంకు నుంచి చోరీ చేశారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు గతనెల 28న కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎటువంటి క్లూ లభించకపోవడంతో ఈ కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. వేల సంఖ్యలో ఫోన్‌నంబర్లు పరిశీలించి తూమకుంట చెక్‌పోస్టుకు చుట్టూ వంద కిలోమీటర్ల మేర ఆరోజు రాత్రి వెళ్లిన వాహనాలను సీసీకెమెరాల ద్వారా కనిపెట్టారు. ఆఖరికి చిన్నక్లూతో ఢిల్లీకి వెళ్లిన పోలీసులు హరియాణాకు చెందిన నిందితుడు అనిల్‌కుమార్ పన్వార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 1.9కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మిగిలిన బంగారం దొరికేనా?

బ్యాంకు నుంచి కొల్లగొట్టిన 11.5కిలోల బంగారంలో పోలీసులు 1.9కిలోలు రికవరీ చేశారు. మిగిలిన బంగారం మరో నిందితుడి వద్ద ఉంది. ఇందులో కొంత కరిగించి ఖర్చులకు వాడుకున్నట్లు సమాచారం. రాజస్థాన్‌కు చెందిన మరో నిందితుడిని అరెస్ట్ చేస్తే అతడి నుంచి మరికొంత బంగారం రికవరీ చేసే వీలుంటుంది. అయితే ఆ నిందితుడు రాజస్థాన్‌లో ఉన్న న్యాయపరమైన వెసులుబాటుతో పాటు అక్కడి పోలీసులు, అధికారుల సాయంతో తప్పించుకోగలిగాడు. ఆ నిందితుడు ఓకేసులో రిమాండుకు వెళ్లినట్లు తెలిసింది. దీంతో అతడిని ఇప్పట్లో అరెస్ట్ చేసే అవకాశాలు కనిపించలేదు. దీంతో చోరీ అయిన బంగారం ఎంత రికవరీ అవుతుందో తెలియని పరిస్థితి. ఇదంతా కొన్నేళ్ల కిందట వచ్చిన ఖాకీ సినిమాను తలపిస్తోందని పలువురు అధికారులే పేర్కొంటున్నారు. కాగా చోరీ అయిన బంగారానికి ఇన్స్యూరెన్స్ ఉండటంతో బ్యాంక్ అధికారులు నిమ్మలంగా ఉంటున్నారు.

కోయంబత్తూరులో బైక్ కొని, బెంగళూరులో వదిలేశారు..

బ్యాంకు దోపిడీకి నెల ముందే దుండగులు రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. చోరీకి రెండ్రోజుల ముందు కూడా సీసీ కెమెరాలకు చిక్కకుండా బ్యాంక్ చుట్టూ రెక్కీ నిర్వహించినట్లు తెలిసింది. చోరీకి కొన్ని రోజుల ముందు కోయంబత్తూరు లో సెకెండ్‌హ్యాండ్ బైక్‌ను కొనుగోలు చేశారు. అదేబైక్‌పై దొంగతనానికి వచ్చారు. చోరీ తర్వాత ఆ బైక్‌ను తీసుకెళ్లి బెంగళూరు మెజిస్టిక్‌లో పార్క్ చేశారు. తర్వాత ఎత్తుకెళ్లిన బంగారంలో కొంత విక్రయించి అక్కడ సెకెండ్ హ్యాండ్ కారును రూ.3.5లక్షలకు కొనుగోలు చేసి అందులో ఢిల్లీకి వెళ్లారు. ఆ కారును కూడా ఢిల్లీలోని ఓ రైల్వేస్టేషన్ వద్ద పార్క్‌చేసి వేరే వాహనంలో వెళ్లిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు.

12రోజులు పోలీస్ కస్టడీకి నిందితుడు

ఇవన్నీ ఇలా ఉంటే ఈనెల 16న కోర్టులో అనిల్‌కుమార్ పన్వార్‌ను అరెస్ట్ చూపగా అతడికి కోర్టు రిమాండు విధించింది. కానీ చోరీ అయిన మొత్తం బంగారాన్ని రికవరీ చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండ్రోజుల కిందట నిందితుడిని పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. బ్యాంకు కిటికీలు కత్తిరించి లోనికి వెళ్లడానికి ఉపయోగించిన కట్టర్, మరికొన్ని వస్తువులను తుమకూరులో కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీనిపై గత మూడు రోజులుగా సీఐ ఆంజనేయులు, మరికొంతమంది సిబ్బందిని వెంట బెట్టుకుని నేరానికి ఉపయోగించిన పరికరాలు, వాహనాలు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. మరి పోలీసుల కృషి ఎంతమేరకు ఫలించి, బంగారం రికవరీ అవుతుందో వేచి చూడాలి.

పరిటాల రవికి మరణం లేదు

6

- ఆయన ఆశయాలను శ్రీరామ్, సిద్ధార్థ కొనసాగిస్తున్నారు
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
- టీడీపీ రామగిరి కార్యాలయంలో ఎన్టీఆర్, రవి విగ్రహాల ఆవిష్కరణ



ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్‌కు గజమాల

నిమజ్జనానికి పటిష్ట భద్రత: ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ రత్న శుక్రవారం తెలిపారు. హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, కదిరి, సబ్‌డివిజన్ పరిధిలో 4508 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు.

నిమజ్జనంపై డేగకన్ను

వినాయక విగ్రహాల ఏర్పాటు మొదలు, నిమజ్జనం వరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. ప్రాంతాలవారీగా విగ్రహాల వద్ద గస్తీలు చేపడుతున్నామని అన్నారు. అత్యాధునిక సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో డేగకన్ను వేశామని అన్నారు. అసాంఘిక శక్తులు, అల్లరిమూకలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. నిమజ్జన సమయంలో డీజేల శబ్దాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. వినాయక నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీలు, పీస్ కమిటీలు సంయుక్తంగా కృషి చేయాలని ఎస్పీ కోరారు. ఏదైనా సహాయం లేదా సమాచారం కోసం 112 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

అర్హులందరికీ పింఛన్లు : కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులందరికీ సెప్టెంబరు 1న పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం ఆయన పింఛన్ల పంపిణీపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ, తహసీల్దార్లు, సచివాలయ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో సెప్టెంబరు 1న 2,64,663మందికి రూ.115.68కోట్లు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో 36,793మంది వికలాంగ పింఛన్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. వీటిలో 7,163మంది వివిధ కారణాల వల్ల అర్హత కోల్పోయారన్నారు. అయితే సంబంధిత మండలపరిషత్, మున్సిపల్, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నవారందరికి పింఛన్లు అందచేస్తామన్నారు. ఈనెల 30వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముందన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం, పలుశాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అందుబాటులో యూరియా

జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం తగినంత యూరియా నిల్వ ఉందని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి ఆయన జిల్లా వ్యవసాయాధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అక్రమంగా నిల్వ చేసినా, వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగించినా కేసులు నమోదుచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, సర్వేఅధికారి విజయశాంతి, సచివాలయ నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.



అనంతపురంలోని రామ్‌నగర్
పాత కోకోకోలా గోడౌన్ వద్ద చావా గణపతి



నీరుగంటి వీధి 3వ క్రాస్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై వినాయకుడు



రెండో రోడ్డులో పూరీ జగన్నాథుడి రూపంలో గణనాథుడు



రామ్‌నగర్ రేణుకా యల్లమ్మ ఆలయం వద్ద రాధాకృష్ణ గణపతి



మొదటిరోడ్డు శివాలయం వద్ద ఆపరేషన్ సిందూర్ గణపతి



పాతూరు రేణుకా యల్లమ్మ ఆలయం వద్ద సోదరి అశోక సుందరిని ఆడిస్తున్న వినాయకుడు

ఆధ్యాత్మిక శోభ

● విఘ్నపతికి మూడోరోజు విశేష పూజలు

అనంతపురం టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా మూడవరోజున వాడవాడలా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. గ్రామాలు మొదలుకొని జిల్లా కేంద్రం వరకూ అన్ని ప్రాంతాల్లోనూ కొలువుదీరిన గణపయ్యలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శుక్రవారం గజాననుడి మండపాలన్నింటిలోనూ స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, రకరకాల పుష్పాలంకరణలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు అందరూ గణనాథుని ముందు గుంజిళ్లు తీసి, నైవేద్యాలు సమర్పించి తమ కష్టాలు తొలగించి సుఖాలు ప్రసాదించాలంటూ మొక్కులు తీర్చుకున్నారు.

ఈ సందర్భంగా విభిన్న రూపాల్లో పార్వతీ తనయుడు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పలుప్రాంతాల్లో వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పరిటాల రవికి మరణం లేదు

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



రామగిరి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్రకు మరణం లేదని, ఆయన ఆశయాలను పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థ ముందుకు తీసుకువెళుతున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. పరిటాల రవీంద్ర అందరి గుండెల్లో బతికే ఉన్నారని అన్నారు. రామగిరిలోని టీడీపీ కార్యాలయ ఆవరణలో పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాలను శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది అభిమానులు తరలివచ్చారు. ముందుగా మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరిటాల రవి ఆశయాలు ఎంతో గొప్పవని అన్నారు. ఎంతో మంది అన్నదాతలకు అండగా నిలిచారని, పేదింటి ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేశారని, రక్తదానం చేయించారని అన్నారు. ఆయన గురించి కొందరు విమర్శలు చేయడం వారి కుసంస్కారానికి నిదర్శనమని అన్నారు.



రక్త దాతలతో ఎమ్మెల్యే పరిటాల సునీత

కట్టె కాలేవరకూ ఇక్కడే..

పరిటాల రవికి దేవుడిచ్చిన తండ్రి ఎన్టీఆర్ అని పరిటాలశ్రీరామ్ అన్నారు. పరిటాల రవీంద్రను కొండపల్లి సీతారామయ్య, ఎన్టీఆర్ ముందుండి నడిపించారని అన్నారు. ఆయన కుమారుడిగా పుట్టడం గర్వంగా ఉందని అన్నారు. తమ కట్టె కాలేవరకు టీడీపీలోనే పనిచేస్తామని, సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌ల కోసం నిలబడతామని అన్నారు. తండ్రి ప్రేమ తనకు చిన్నతనంలోనే దూరమైందని, కానీ వేలాది మంది అభిమానులను తమ కుటుంబానికి ఆయన అందించారని అన్నారు. తమను ముందుండి నడిపిస్తున్న అభిమానులకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. పరిటాల రవి పిలుపు ఇచ్చిన రక్తదానం నేటికి నిర్విరామంగా కొనసాగుతోందని అన్నారు.

రక్తదాన శిబిరం

పరిటాల రవీంద్ర మెమోరీయల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్టు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, అనంతపురం, హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రుల సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వెయ్యి మందికి పైగా అభిమానులు రక్తదానం చేశారు. రక్త దాతలను పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ, జ్ఞాన, తేజస్విని పలకరించి, జ్ఞాపికలను అందజేశారు. బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 980 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, మందులు, కంటి అద్దాలను ఉచితంగా పంపిణీచేశారు.



కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

నేడు పెనుకొండలో..

పెనుకొండ టౌన్: పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాన్ని పెనుకొండలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత శనివారం ఆవిష్కరిస్తారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పరిటాల అభిమానులకు మంత్రి పిలుపునిచ్చారు. పెనుకొండ దర్గా సర్కిల్‌లో శనివారం ఉదయం 9గంటలకు విగ్రహావిష్కరణ జరుగుతుందని తెలిపారు.

సార్.. చేతులెత్తి మొక్కుతాం..
న్యాయం చేయండి

● తూనికలు, కొలతలు అధికారికి రైతుల విన్నపం



చేతులు జోడించి అధికారులకు మొక్కుతున్న రైతు

విడపనకల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 'సార్..! మీకు చేతులెత్తి మొక్కుతాం. మాకు న్యాయం చేయండి. మేం పండించిన పంటలను వ్యాపారులు, దళారులు న్యాయంగా కొనేలా చర్యలు తీసుకోండి' అంటూ తూనికలు కొలతలు అధికారి శంకర్‌ను మండలంలోని పాల్తూరు రైతులు కోరారు. గ్రామంలో వేరుశనగ తూకాల్లో బాదు పేరిట జరుగుతున్న మోసంపై 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ఓ కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన జాయింట్ కలెక్టర్ తూనికలు కొలతల శాఖ అధికారులను పాల్తూరు గ్రామానికి పంపారు. దీంతో తూనికలు కొలతలశాఖ అధికారులు శుక్రవారం ఉదయం పాల్తూరు గ్రామం చేరుకుని రైతులతో చర్చించారు. వ్యాపారులను పిలిపించి ఎక్కడైనా సరే 40 కిలోల బస్తాకు 2 కిలోలకు మించి బాదును తీసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. లారీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మారయ్య పొలంలో ఓ వ్యాపారి 43.5 కిలోల తూకం పట్టిన విషయాన్ని గమనించిన అధికారి తిరిగి వాటిని 42 కిలోలకు మార్పించారు. వేరుశనగ కాయలు వేస్తున్న ఖాళీ బ్యాగులు ఉల్లిగడ్డలు వేసే బ్యాగులు కావటంతో కనీసం 10 గ్రాములు కూడా లేని సంచికి అరకిలో బాదు తీయటం ఏంటి అని వ్యాపారులను ప్రశ్నించారు. రైతుల పొలాలు వద్దకే తూనికలు కొలతలశాఖ అధికారులు వెళ్లి ఏ వ్యాపారి వచ్చినా 42కిలోలకు కిలో కూడా ఎక్కువ ఇవ్వద్దు అని సూచించారు. ఎవరైనా అధికంగా డిమాండ్ చేస్తే తమకు ఫోన్ చేయమని నంబర్లను ఇచ్చారు. 'వర్షాలు పడుతున్నాయి. పొలాల్లోనే రాశులు వేసుకున్నాము. దిగుబడి తడిస్తే నష్టపోతాము. ప్రభుత్వం తరఫున వేరుశనగ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోండి' అంటూ పలువురు రైతులు వేడుకున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలోని 22ఏ, చుక్కల భూములను తొలగించేందుకు, ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో డీఎల్సీ/డీఎల్ఎస్సీ సమావేశాన్ని జేసీ శివనారాయణ శర్మతో కలిసి శుక్రవారం నిర్వహించారు. చుక్కల భూములకు సంబంధించి 15 క్లెయిమ్స్‌ను విచారించారు. అందులో తొమ్మిదింటిని ఆమోదించి, ఆరింటిని తిరస్కరించారు. 22ఏకు సంబంధించి 25 క్లెయిమ్స్‌ను విచారించారు. అందులో రెండింటిని ఆమోదించి, 17 దరఖాస్తులను తిరస్కరించారు. ఆరింటిని పునఃపరిశీలనకు పంపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సంబంధించి 22ఏ కేసులను శనివారం విచారిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంపై
పోలీసు నిఘా



నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణేష్ విగ్రహాల నిమజ్జనంపై పోలీసు నిఘా పెట్టారు. నిమజ్జనం ప్రశాంతంగా సాగేలా నిఘా ఉంచినట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా నిమజ్జనంపై డ్రోన్లతో నిఘా పెట్టి, ఎప్పటికప్పుడు పోలీసులను అప్రమత్తం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం రాచానపల్లి, పంపనూరు సమీపంలో వినాయక నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శేఖర్, పీఎస్ఐ సాయి పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

అనంతపురం టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తెలుగుభాషకు ప్రపంచవ్యాప్తంగా వన్నెతెచ్చిన గిడుగు రామమూర్తితోపాటు తెలుగుతల్లికి పలువురు సాహితీవేత్తలు పూలమాలలు వేసి, వేడుకలు చేసుకున్నారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థులతో కలిసి రాజ్యమహిళా సమ్మాన్ అవార్డు గ్రహీత డాక్టర్ నల్లాని రాజేశ్వరి ఎస్పీ బంగ్లా సమీపంలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఆమె మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు మూలపురుషుడన్నారు. ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు గిడుగు ఉద్యమం వల్ల వ్యవహారిక భాషలో అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి గిడుగు కృషి కారణంగా సృజనాత్మకత ఉన్న ప్రతి ఒక్కరికీ అబ్బిందని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమనాయుడు, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, తెలుగుశాఖ అధ్యక్షుడు నగరూరు రసూల్ పాల్గొన్నారు.

తెలుగుభాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో...

తెలుగు భాషా సంరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ నారాయణ అధ్యక్షతన కేఎస్ఆర్ ఉన్నత పాఠశాల నుంచి ఎస్పీ కార్యాలయం వద్ద గల తెలుగుతల్లి విగ్రహం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, 'జై తెలుగుతల్లి... తెలుగు భాష వర్ధిల్లాలి' అంటూ నినదించారు. తెలుగుభాష గొప్పదనాన్ని గురించి స్మరించుకున్నారు. కార్యక్రమంలో గుడిపాటి సూర్యం, కేఎస్ఆర్ పాఠశాల టీచర్లు శ్రావ్య, విజయ, లత, విద్యార్థినులు పాల్గొన్నారు.

జిరసం ఆధ్వర్యంలో...

జిల్లా రచయితల సంఘం (జిరసం) ఆధ్వర్యంలో సాహితీకారులు తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేయడంతో పాటు తెలుగు భాష ఔనత్యాన్ని, మాధుర్యాన్ని కొనియాడారు. కార్యక్రమంలో జిరసం అధ్యక్షుడు కొత్తపల్లి సురేష్, ప్రధాన కార్యదర్శి కోటిగారి వన్నప్ప, ఉపాధ్యక్షుడు గోసల నారాయణస్వామి, కార్యదర్శి చేగువేరా హరి, గుడిపాటి సూర్యనారాయణ, ఒంటెద్దు రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పిస్తున్న ఎస్ఎస్‌బీఎన్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు

యువకుడి ఆత్మహత్య



అనిల్‌కుమార్ (ఫైల్)

కూడేరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌సీసీ నగర్ సమీపాన యువకుడు అనిల్‌కుమార్ (23) శుక్రవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కనగానపల్లి మండలం గుంతపల్లికి చెందిన సరస్వతి, నారాయణ దంపతుల కుమారుడు అనిల్ కుమార్ కియ కంపెనీలో పనిచేస్తుండేవాడు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో కూడేరు మండలం ఎన్‌సీసీ నగర్ ముత్యాల రెడ్డి వెంచర్ వద్ద చీరతో చెట్టుకు ఉరేసుకున్నాడు. పశువుల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాజు ఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

కానిస్టేబుల్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

అనంతపురం వైద్యం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్య (ఫిజికల్ ఫిట్‌నెస్) పరీక్షలు నిర్వహిస్తున్నారు. దాదాపు 480మంది అభ్యర్థులను గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజులపాటు పరీక్షించనున్నారు. ఆర్థోపెడిక్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్లు చందన, రాఘవేంద్రరాజు, చైతన్య, ఆప్తాలమిక్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు మానస, భవానిశంకర్, జనరల్ సర్జన్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్లు నారాయణ, శివశంకర్ నాయక్, రమాబాయి, ఉజ్జినేశ్వరి, జనరల్ మెడిసిన్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ బుచ్చయ్య, ఎస్ఆర్‌లు మహతీష్, శ్వేత శుక్రవారం నాటికి 300మందికిపైగా పరీక్షలు నిర్వహించారు. మిగిలిన అభ్యర్థులను శనివారం పరీక్షించనున్నారు.

నాటుసారా రహిత జిల్లాగా అనంత

కలెక్టర్ వినోద్‌కుమార్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎక్సైజ్ శాఖ అధికారులు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నాటుసారా రహిత జిల్లాగా అనంతను ప్రకటించినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎక్సైజ్ శాఖ పరిధిలో నవోదయం 2.0పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 104 గ్రామాలను నాటుసారా రహితమైనవిగా ప్రకటించామన్నారు. నాటుసారా నిర్మూలనకు ఎప్పటికప్పుడు దాడులు చేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. నవోదయం 2.0పై ఎక్సైజ్ శాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్వో మలోల, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, సీఐలు సత్యనారాయణ, సునీల్, సాగర్, సోమశేఖర్, సునీత, జయనాథరెడ్డి, ఎస్ఐ జాకీర్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని ఎస్పీ జగదీష్‌తో కలిసి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతపురం నగరంలో ఎన్ని పార్కింగ్ ప్రాంతాలు అవసరమవుతాయో గుర్తించాలన్నారు. జిల్లాలో గంజాయిని అరికట్టాలన్నారు. వెల్ఫేర్ హాస్టళ్లు, మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల్లో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ... గుత్తి-గుంతకల్లు రహదారిలో అవసరమైనచోట సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రేడియం స్టిక్కర్ వేయాలన్నారు. ప్రతి విద్యాసంస్థలో వారానికోసారి 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 గురించి తెలియజేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోరుకొన్న ప్లేస్..!

(5వ పేజీ తరువాయి)



ఎవరు ఎక్కువగా ఇచ్చుకుంటే వారికే అవకాశం కల్పిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాసులు ఇచ్చుకోకుంటే ఆప్షన్ ఫాం ఇచ్చి వారాలు గడుస్తున్నా.. ఆర్డర్లు అందట్లేదని బాధిత ఉద్యోగులు వాపోతున్నారు. డీపీఓలో పనిచేస్తున్న ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు వసూళ్ల పర్వం సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీ ఆర్డర్లు ఇవ్వడంలో జాప్యం చేయడం ద్వారా దగ్గరి స్థానాలకు మరింత రేటు పలికేలా చక్రం తిప్పుతున్నారని తెలుస్తోంది. దగ్గరి స్థానం అడిగిన వారితో బేరసారాలకు దిగుతున్నారు. ఎవరు ఎక్కువగా ఇచ్చుకుంటే వారికే ఖరారవుతుంది. ఒకరికి మాట ఇచ్చిన తరువాత కూడా మరొకరు అంతకన్నా ఎక్కువగా ఇచ్చుకుంటామంటే మళ్లీ మార్చేశారు. ఇలా.. వేలం పాట తరహాలో వసూళ్ల బేరాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ముడుపులు ముట్టజెప్పాల్సిందే..

గ్రేడ్-5 కార్యదర్శులు, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్లు మొదలుకుని గ్రేడ్-1 కార్యదర్శి నుంచి డిప్యూటీ ఎంపీడీఓ ప్లేస్‌మెంట్ కావాలన్నా, గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 ఉద్యోగోన్నతుల్లో భాగంగా దగ్గరగా ఉండే మేజర్ పంచాయతీ కావాలన్నా అందుకు తగ్గట్టుగానే ముడుపులు ముట్టజెప్పాలన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ పోస్టింగ్‌ల కంటే డెప్యుటేషన్, ఇన్‌చార్జి బాధ్యతలైతే మరింత ధరలు పలుకుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది. 8 ఏళ్లగా ఉద్యోగోన్నతులు కల్పించలేదు. కొందరైతే సర్వీస్‌లో చేరిన 20 ఏళ్ల తరువాత ఉద్యోగోన్నతి కల్పిస్తున్నారు. దీనిని డీపీఓలో పనిచేస్తున్న ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్ల సొమ్ము చేసుకుంటున్నారు. ఆశావహుల నుంచి ముక్కుపిండి లక్షల్లోనే వసూలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగోన్నతులు కల్పించి ప్లేస్‌మెంట్ల కోసం ఆప్షన్ ఫాం తీసుకుని, 10 రోజులైనా ఇప్పటికీ ప్లేస్‌మెంట్లు మాత్రం ఖరారు చేయలేదు. ఎంత లేటు అయితే అంత డిమాండ్ పెరుగుతుందన్న ఉద్దేశంతోనే కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ముట్టజెప్పిన వారు ఏమిటి ఇంకా ఆలస్యం అని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తుంటే.. ఇంకొంచెం ఎక్కువ ఇస్తామనీ, ఆ సీటు తమకివ్వాలంటూ మరికొందరు క్యూ కడుతున్నారని తెలుస్తోంది. వసూళ్ల తంతు పబ్లిక్‌గానే సాగుతున్నా డీపీఓ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సీనియర్ల పేర్లేవీ?

గ్రేడ్-4 కార్యదర్శులకు రోస్టర్‌కు అనుగుణంగా ఉద్యోగోన్నతులు కల్పించారు. డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల్లో పనిచేసే సీనియర్ సిబ్బందికి సీనియార్టీ జాబితాలో చోటు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. బాధితులు.. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వెళితే.. ఓ డిజిటల్ అసిస్టెంట్ మధ్యవర్తిత్వానికి యత్నించినట్లు తెలిసింది. డీపీఓగా నాగరాజనాయుడు కొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. కార్యాలయంలో పనిచేసే వారిని కాదని ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లను సీసీలుగా నియమించుకుని, దందాలకు తెరలేపారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఇద్దరి సీసీలకు మరో ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు సహాయకులుగా డీపీఓ కార్యాలయంలోనే పాగా వేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సీసీలపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నా.. అక్రమాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నా.. వారిని మార్చకపోవడంలో అంతర్యం ఏమిటన్నది అంతుచిక్కడం లేదు. సీసీలుగా నియమించుకున్న డిజిటల్ అసిస్టెంట్ల స్థానాల్లో ఇతరులనూ నియమించలేదు. దీంతో ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నేడు బార్ లాటరీ

అనంతలో 19కిగానూ పదింటికే దరఖాస్తులు

శ్రీసత్యసాయి జిల్లాలో 12 బార్లలో ఏడింటికే..

కలెక్టర్ల సమక్షంలో లక్కీ డ్రా ద్వారా కేటాయింపులు

అనంతపురం క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో బార్ లైసెన్సుల కేటాయింపునకు శనివారం లక్కీ డ్రా తీయనున్నారు. రెండు జిల్లాల్లో ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. అనంతపురం జిల్లాలో 19 బార్లకుగానూ పదింటికి మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. తొమ్మిది బార్లకు ఒక్క దరఖాస్తూ రాలేదు. రెండు గీత కులాల బార్లకు కూడా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు గడువు శుక్రవారం ముగిసింది. పది బార్లకు 40, రెండు గీత కులాల బార్లకు 10 కలిపి మొత్తం 50 దరఖాస్తులు వచ్చాయి. జడ్పీ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ వినోద్ కుమార్ శనివారం లక్కీ డ్రా తీయనున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 12 బార్లకు దరఖాస్తులు పిలవగా ఐదింటికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. హిందూపురం మున్సిపాలిటీలో నాలుగు బార్లకుపిలవగా, మూటింటికి 19 దరఖాస్తులు వచ్చాయి. కదిరిలో మూడు బార్లకుగానూ రెండింటికి 8 దరఖాస్తులు వచ్చాయి. ధర్మవరంలో మూటింటికి గానూ ఒక్క బార్‌కు మాత్రమే నాలుగు దరఖాస్తులు వచ్చాయి. పెనుకొండలో ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు వచ్చాయి. మడకశిరలో ఒకే బార్ కాగా.. ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. హిందూపురంలో గీత కులాలకు కేటాయించిన బార్ అండ్ రెస్టారెంట్‌కు 11 దరఖాస్తులు వచ్చాయి. దీనికి దరఖాస్తు ఫీజు తక్కువ కావడంతో పోటీ పడ్డారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో శనివారం ఉదయం 9 గంటలకు లాటరీ తీస్తారు. లైసెన్స్ దక్కించుకున్నవారు 15 రోజుల్లోపు బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇస్తారు.

యువతి అదృశ్యం

గార్లదిన్నె, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన యువతి నారాయణమ్మ అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రవి, నాగలక్ష్మి దంపతుల కుమార్తె నారాయణమ్మ గురువారం నుంచి కనిపించడం లేదు. నారాయణమ్మ కోసం తల్లిదండ్రులు బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. తమ కుమార్తె అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

నిమజ్జనానికి లోతు చూద్దామని..

● చిత్రావతి నదిలో మునిగి బీటెక్ విద్యార్థి మృతి


హేమంత్‌కుమార్ మృతదేహం

బత్తలపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి చిత్రావతి నది లోతు చూసేందుకు ప్రయత్నించిన బీటెక్ విద్యార్థి అందులో మునిగి మరణించాడు. మండలంలోని సంగమేశ్వరం వద్ద శుక్రవారం చిత్రవతి నదిలో మునిగి బీటెక్ విద్యార్థి హేమంత్ కుమార్ (23) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన శ్రీనివాసులుకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు హేమత్‌కుమార్ బీటెక్ ఫైనలియర్ చదువుతుండేవాడు. హేమంత్ కుమార్.. మిత్రులతో కలిసి కాలనీలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రతిమను శనివారం నిమజ్జనం చేయాలనున్నారు. సంగమేశ్వరంవద్ద చిత్రావతి నది లోతును పరిశీలించేందుకు మిత్రులతో కలసి హేమంత్ కుమార్ దిగాడు. లోతును పరిశీలిస్తూ కొద్దిదూరం వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగి పోశాగాడు. గట్టిగా కేకలు వేశాడు. వెంటనే మిత్రులు తమ టీషర్టులను కలిపి, కాపాడే ప్రయత్నం చేశారు. అయినా హేమంత్ మునిగిపోయాడు. చుటుపక్కల వారి సాయంతో హేమంత్‌కుమార్‌ను బయటకు తీసి, బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. కుటుంబీకులు ఆస్పత్రికి చేరుకుని, బోరున విలపించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

10 రోజుల తర్వాత మృతదేహం లభ్యం


బత్తల పవన్ (ఫైల్)

బొమ్మనహాళ్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)లో పది రోజుల క్రితం గల్లంతైన యువకుడి మృతదేహం జిల్లాలో శుక్రవారం లభ్యమైంది. కర్ణాటక రాష్ట్రంలోని కుడితిని ఠాణా పరిధి తిమ్మలాపురం గ్రామ సమీపాన హెచ్చెల్సీలో ఈనెల 19న బత్తల పవన్ (22) గల్లంతయ్యాడు. అతడి మృతదేహం మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద లభ్యమైంది. బంధవులు, హెడ్ కానిస్టేబుల్ నరేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన బత్తల పవన్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. లారీ పని మీద కర్ణాటకకు వెళ్లాడు. ఈ 19న కుడితిని ఠాణా పరిధిలోని తిమ్మలాపురం గ్రామ సమీపాన హెచ్చెల్సీలోకి ఈత కోసం వెళ్లాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. శుక్రవారం మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద డిస్ట్రిబ్యూటరీలో శవమై కనిపించాడు. స్థానికులు.. బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానిక పోలీసులు ఆరాతీయగా కుడితిని పోలీసుస్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలిసింది. సమాచారం ఇవ్వడంతో కుడుతిని పోలీసులు వచ్చి, శవాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. పవన్ తండ్రి పెద్దరాజు ఫిర్యాదు మేరకు కుడితిని పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారిస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

గుమ్మఘట్ట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 వీరాపురం గ్రామంలో శుక్రవారం పురుగుల మందు తాగి ముద్దులాపురం లక్ష్మి(30) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈమెకు 12 కిందట లింగప్పతో వివాహం జరిగింది. సంతానం లేకపోవడంతో తరచూ మథనపడేది. ఈక్రమంలో నే తీవ్ర మనస్తాపంతో ఇంట్లో ఉన్న పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పీఆర్ ఎస్ఈగా చిన్న సుబ్బరాయుడు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈగా చిన్న సుబ్బరాయుడును నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లాలో పీఆర్ విభాగంలో ఈఈగా పని చేస్తున్న ఆయన్ను ప్రమోషన్‌పై అనంతపురం ఎస్ఈగా నియమించా రు. జూన్ ఆఖరులో అప్పటి ఎస్ఈ జహీర్ అస్లాం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఈఈగా ఉన్న ప్రభాకర్‌రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. క్లియర్ వేకెన్సీ ఉండటంతో ప్రమోషన్ కల్పించారు. కర్నూలు జిల్లాకు చెందిన చిన్న సుబ్బరాయుడు అక్కడే పీఆర్ విభాగంలో ఎక్కువ కాలం పని చేశారు. ఆయన వచ్చేనెల 3న ఎస్ఈగా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

డీఐఓ బాధ్యతల స్వీకరణ


డీఐఓ దావూద్‌ను అభినందిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, ఉర్దూ టీచర్లు

అనంతపురం విద్య, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో ఉర్దూ మీడియం పర్యవేక్షణకు డీఐఓగా నియమితుడైన దావూద్ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఉన్న ఆఫీస్‌లో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఏపీటీఎఫ్ నాయకులు దావూద్‌ను కలిసి సత్కరించారు. ఉర్దూమీడియం అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, నాయకులు సర్దార్‌వలి, రమణ, సోహెల్, మన్సూర్, బాబ్జాన్, రజాక్, అమీనుద్దీన్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి సీనియర్ టెన్నికాయిట్ ఎంపిక పోటీలు ఈనెల 31వ తేదీన స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి రంగస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబరు 13వ తేదీన బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హత గల వారు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలకు 9652117133, 8179819416 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పారా కోర్సులతో మెండైన ఉపాధి

● రెండేళ్ల డిప్లొమాతో అవకాశం
● కోర్సుల ప్రవేశాలకు నోటిఫికేషన్



అనంతపురం వైద్యం, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖ అనుబంధంగా ఆరోగ్య సంరక్షణకు వివిధ రూపాల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తున్నాయి. వాటిని సొంతం చేసుకోవాలంటే పారా మెడికల్ సైన్స్ కోర్సులను అభ్యసించాలి. వాటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనుబంధ, ఆరోగ్య సంరక్షణ వృత్తుల మండలి(ఏపీఎస్ఏహెచ్‌పీసీ) డిప్లొమా కోర్సుల రూపంలో అందిస్తోంది. రెండేళ్ల వ్యవధిగల కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. ఏపీఎస్ఏహెచ్‌పీసీ అనుబంధంగా ప్రభుత్వ వైద్య కళాశాల డిప్లొమా కోర్సులను అందిస్తోంది. ఇంటర్మీడియట్ బైపీసీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు నోటిఫికేషన్ జారీచేశారు.

సీట్ల కేటాయింపు వివరాలు...

కోర్సు పేరు	సీట్లు
డీఎంఎల్‌టీ	30
డీఓఏ	10
డీఏఎన్ఎస్	30
డీఎంఐటీ	30
డీఈసీజీ	10
డీఆర్‌జీఏ	10
డీఆర్ఏ	10
డీఎంఎస్‌టీ	15
మొత్తం	145

రెండేళ్ల కోర్సులు

ఏపీఎస్ఏహెచ్‌పీసీ ఆధ్వర్యంలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ), ఆప్తాల్మిక్ అసిస్టెంట్(ఓఏ), అనస్తీషియా టెక్నీషియన్(ఏఎన్ఎస్), మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్(ఎంఐటీ), ఈసీజీ టెక్నీషియన్(ఈసీజీ), రేడియో గ్రాఫిక్ అసిస్టెంట్(ఆర్జీఏ), డార్క్‌రూమ్ అసిస్టెంట్(డీఆర్ఏ), మెడికల్ స్టెరిలేజేషన్ మేనేజ్‌మెంట్ స్టాఫ్(ఎంఎస్‌టీ) తదితర కోర్సులను అందిస్తోంది. రెండేళ్ల డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు వైద్యశాఖలో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రైవేట్ ఆస్పత్రుల్లోని ఆపరేషన్ థియేటర్లు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు, నేత్ర పరీక్షల విభాగం తదితర విభాగాల్లో ఉపాధి లభిస్తుందని వివరిస్తున్నాయి.

8 వరకు దరఖాస్తులు



పారామెడికల్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు సెప్టెంబరు 8 వరకు ఉంది. ఇంటర్మీడియేట్‌లో బైపీసీ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులు. https://ananthapuramu.ap.gov.in/ వెబ్‌పోర్టల్ ద్వారా దరఖాస్తును డౌన్ చేసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తుకు, అర్హత ధ్రువపత్రాలు జతపరచాలి. వాటిని వైద్య కళాశాలలో అందజేయాలి.

-ప్రొఫెసర్ షారోన్ సోనియా, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ఆంధ్రా అండర్-19 క్రికెట్ జట్టుకు జయంత్


జయంత్ కృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-19 క్రికెట్ జట్టులో జిల్లాకు చెందిన జయంత్‌కృష్ణ చోటు దక్కించుకున్నాడు. శనివారం నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించే జాతీయ టోర్నీలో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన జయంత్‌కృష్ణను పలువురు అభినందించారు.

అక్రెడిటేషన్ గడువు పొడిగింపు

అనంతపురం కలెక్టరేట్, పుట్టపర్తి రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల గడువును మరో మూడు నెలలు పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఉత్వర్వులు జారీ చేశారని కలెక్టర్ వినోద్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా డీపీఆర్ఓ వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి నవంబరు 30 వరకూ గడువు పొడిగిస్తామని వారు తెలిపారు. తమ సంస్థలలో పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి కార్యాలయాలలో యాజమాన్యం అందజేయాలని కోరారు.

ఓరి.. నాయనో..!

● ఇంకా 50మందికిరాని మెసేజ్‌లు
● పారదర్శకత పేరుతో అభ్యర్థులతో ఆటలు
● రెండోరోజు కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన
● మూడురోజులైనా పూర్తిస్థాయిలో రాని డీఎస్సీ ఎంపిక జాబితా


రెండోరోజు పీవీకేకేలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం విద్య ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియలో రాష్ట్రశాఖ కొత్తగా అమలు చేస్తున్న నిబంధనలు అభ్యర్థులను అయోమయంలోకి నెడుతున్నాయి. గతంలో డీఎస్సీ ఎంపిక జాబితాను మెరిట్, రోస్టర్ ఆధారంగా అభ్యర్థులను కూర్పేబెట్టి జిల్లాస్థాయిలో విద్యాశాఖ ఒకేసారి విడుదల చేసేది. ఆ తర్వాత సర్టిఫికెట్ల పరిశీలన చేసేవారు. అందులో ఏమైనా తేడాలుంటే వారిని జాబితా నుంచి తప్పించి, ఆ తర్వాతి స్థానంలో ఉన్న అదే రోస్టర్ పాయింట్ అభ్యర్థికి మెరిట్ ఆధారంగా కూర్పేబెట్టేవారు. ఇపుడు డీఎస్సీ సెలెక్షన్ లిస్టు మొత్తం రాష్ట్రశాఖ నుంచే తయారుచేసి పంపుతున్నారు. అదికూడా ఒకేసారి కాకుండా రోజుకు కొన్ని పంపిస్తుండడంతో అభ్యర్థుల్లో అయోమయం, ఆందోళన నెలకొన్నాయి. అనంత జిల్లాకు 807 టీచర్ పోస్టులకు జాబితా పంపాల్సి ఉంది. మూడురోజులైనా పూర్తిస్థాయి జాబితా రాలేదు. తొలిరోజు జిల్లాలో 625 మంది అభ్యర్థులకు సెలెక్టల జాబితాలో ఉన్నట్లు మెసేజ్‌లు రాష్ట్రశాఖ నుంచి పంపారు. వీరందరికీ గురువారం జిల్లాకేంద్రంలోని పీవీకేకే కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నారు. గురువారం మరో 132 మందికి మెసేజ్‌లు పంపారు. వారికి శుక్రవారం సర్టిపికెట్ల పరిశీలన చేపట్టారు. ఈలెక్కన ఇంకా జిల్లాలో 50 మంది అభ్యర్థులకు శుక్రవారం రాత్రి వరకు మెసేజ్‌లు రాలేదు. దీంతో మెసేజ్‌లు వస్తాయా, రావా? అని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే మిగిలిన వారికి ఎప్పుడు మెసేజ్‌లు వస్తాయోనని సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రానికి వచ్చి విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులను ప్రాధేయపడుతున్నారు. విద్యాశాఖ అధికారులు సైతం వీటిపై క్లారిటీ ఇవ్వట్లేదు. మెసేజ్‌లు వస్తాయని చెప్పి పంపుతున్నారు. మొత్తంమీద పారదర్శకత పేరుతో రాష్ట్ర అధికారులు.. డీఎస్సీ అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.

కొనసాగిన పరిశీలన

డీఎస్సీ సెలెక్టలిస్టులో ఉన్న అభ్యర్థులకు రాష్ట్రశాఖ మెసేజ్‌లు పంపిస్తోంది. అలా జిల్లాలో రెండురోజుల్లో 757 మందికి మెసేజ్‌లు వచ్చినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. వీరిలో గురు, శుక్రవారాల్లో 748 మంది సర్టిపికెట్ల పరిశీలనకు హాజరయ్యారనీ, 9 మంది రాలేదన్నారు. ఈగైర్హాజరైన వారిలో కొందరు వచ్చినా వారి సర్టిఫికెట్లలో తేడాలు ఉండడంతో తీసుకురావడానికి కొందరు వెళ్లారన్నారు. మరికొందరు సమాచారం తెలీక రాలేదనీ, అలాంటి వారికి ఫోన్లు చేసి, సమాచారం ఇచ్చి పిలిపించుకుంటున్నామని డీఈఓ తెలిపారు. ఎంపిక జాబితాలో ఉన్న వారందరికీ సమాచారం ఇచ్చి, సర్టిఫికెట్ల పరిశీలనకు అవకాశం కల్పిస్తున్నామన్నారు మిగిలిన 50మంది అభ్యర్థులకు శనివారం ఉదయంలోగా మెసేజ్‌లు వచ్చే అవకాశం ఉందనీ, రాగానే వారు పీవీకేకే కాలేజీకి వచ్చి సర్టిఫికెట్లను పరిశీలించుకోవాల్సి ఉంటుందని డీఈఓ వివరించారు.

క్రీడాకారులు రైల్వే సౌకర్యాలను వినియోగించుకోవాలి

● డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రైల్వే అందజేస్తున్న క్రీడా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఆటగాళ్లు తమ ప్రతిభా పాటవాలను మెరుగుపరచుకోవాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించా రు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్ఎం మాట్లాడుతూ రైల్వే శాఖ ప్రజా సేవతోపాటు, క్రీడాభివృద్ధికి ఎంతో తోడ్పడుతోందన్నారు. అధునాతనమైన రైల్వే గ్రౌండు, ప్రాక్టీస్ పిచ్‌లు, జిమ్ తదితర సదుపాయాలను వినియోగించుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక రైల్వే గ్రౌండులో రైల్వేలోని వివిధ శాఖల ఉద్యోగులు క్రికెట్‌ను ఆడారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం సుధాకర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాచిగూడ-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాచిగూడ-తిరుపతి మధ్య (వయా గుంతకల్లు) ఈ నెల 29, 30 తేదీల్లో ఓ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ-తిరుపతి (02794) ప్రత్యేక రైలు ఈ నెల 29న రాత్రి 11 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 1 గంటకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (02793) 30న రాత్రి 9-10 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు కాచిగూడకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, సేడం, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, తాడిపత్రి, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

బిలాస్‌పూర్-యల్హంక మధ్య..

దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సెప్టెంబరు 9 నుంచి నవంబరు 19 వరకూ బిలాస్‌పూర్-యల్హంక (వయా గుంతకల్లు) మధ్య ఓ ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బిలాస్‌పూర్-యల్హంక ప్రత్యేక రైలు (08261) సెప్టెంబరు 9 నుంచి నవంబరు 18 వరకూ ప్రతి మంగళవారం ఉదయం 11 గంటలకు బిలాస్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7 గంటలకు యల్హంకకు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (08262) సెప్టెంబరు 10 నుంచి నవంబరు 19 వరకూ ప్రతి బుధవారం ఉదయం రాత్రి 9 గంటలకు యల్హంకలో బయలుదేరి శుక్రవారం ఉదయం ఐదున్నరకు బిలాస్‌పూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు భటపర, రాయపూర్, దుర్గ్, రాజనంద్‌గావ్, డోంగర్‌ఘర్, గోండియా, వాడ్సా, చందఫోర్ట్, బాలార్షా, సిర్పూర్ కాగజ్ నగర్, మంచిర్యాల, ఖాజీపేట, చర్లపల్లి, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం, హిందూపురం స్టేషన్ల మీదుగా యల్హంకకు చేరుతుందన్నారు.

ప్యాసింజరు రైళ్ల రద్దు

కర్ణాటకలోని బళ్లారి, తోరణగల్లు స్టేషన్ యార్డుల్లో జరుగుతున్న ఎలెక్ట్రికల్, సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్ పనుల వల్ల గుంతకల్లు మీదుగా వెళ్లే పలు ప్యాసింజరు రైళ్లను రద్దు పరచినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు-చిగ్జాజుర్-గుంతకల్లు ప్యాసింజరు (57415/16) రైలును సెప్టెంబరు 3న రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పాక్షికంగా రద్దయిన రైళ్లు

తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (57405)ను సెప్టెంబరు 2న, దీని తిరుగు ప్రయాణపు రైలు (57405)ను సెప్టెంబరు 3న గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో రద్దుపరచి, కేవలం గుంతకల్లు-తిరుపతి మధ్యన నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. హుబ్లీ-గుంతకల్లు ప్యాసింజరు (56911) రైలును, దీని తిరుగు ప్రయాణపు రైలు (56912)ను సెప్టెంబరు 3న గుంతకల్లు-మునీరాబాద్ సెక్షన్‌లో రద్దుపరచి, మునీరాబాద్-హుబ్లీ సెక్షన్‌లో మాత్రమే నడుపుతామన్నారు. హుబ్లీ-తిరుపతి (57402) ప్యాసింజరును సెప్టెంబరు 3న గంటన్నరపాటు ఆలస్యంగా నడపనున్నట్లు వివరించారు.

నాందేడ్-ధర్మవరం రైలు రద్దు

హైదరాబాద్ రైల్వే డివిజన్‌లో వర్షపు నీరు ట్రాక్‌పై ప్రవహించిన కారణంగా నాందేడ్-ధర్మవరం-నాందేడ్ స్పెషల్ ఫేర్ ఎక్స్‌ప్రెస్‌ను ఒక ట్రిప్పు రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాందేడ్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (07189) రైలును 29న దీని తిరుగు ప్రయాణపు రైలు (07190)ను ఈ నెల 31న రద్దుపరచినట్లు తెలియజేశారు.


తెలుగు శాసనాన్ని పరిశీలిస్తున్న మైనాస్వామి, ఉపాధ్యాయులు తదితరులు

1388లోనే అచ్చమైన తెలుగు శాసనం

● విశ్లేషించిన చరిత్రకారుడు మైనాస్వామి

గోరంట్ల, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరెడ్డిపల్లి సమీప పొలాల్లో 1388లోనే అచ్చమైన తెలుగు భాషలో లిఖించిన శాసనాన్ని చరిత్రకారుడు మైనాస్వామి విశ్లేషించారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన ఉపాధ్యాయులతో కలిసి శాసనంలోని అంశాలను చదివి వినిపించారు. హరిహర రాయల కుమారుడు రెండో బుక్కరాయులు సామాన్య శకం 1388లో మేరెడ్డిపల్లి ప్రజల నీటి అవసరాల కోసం, వ్యవసాయాభివృద్ధికి చెరువులు తవ్వించడం, చిత్రావతి నది నుంచి కాలువలద్వారా నీరు మళ్లించడం విషయాలు చక్కనైన తెలుగులో లిఖించారన్నారు. 1388 నాటికి తెలుగు భాష చందోబద్ధమైన పద్యాల రూపంలో గ్రాంధికంలో ఉండేదన్నారు. శాసనంలోని వచనం ఎంతో సరళంగా, అద్భుతమైన గుండ్రని అక్షరాల వరుస క్రమంలో ఉందన్నారు. శాసనంలో వాడిన పదాలను బట్టి విజయనగర సామ్రాజ్యంలో పెనుకొండ సీమలో తెలుగుభాష తేనెలా మధురంగా ఉండేదనీ, అందుకు ఈ శాసనమే సజీవ సాక్ష్యమన్నారు. రాజులు, కార్యకర్తల పేరుతరువాత గారు అని సంబోధించడం తెలుగుభాషాభివృద్ధికి నిదర్శనమన్నారు. అంతటి గొప్ప తెలుగుభాష రాసిన కర్తపేరు శాసనంలో లేకపోవడం గమనార్హం. పొలాల్లోని శాసనాన్ని మ్యూజియంకు తరలించి భద్రపరచాలని మైనాస్వామి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, పరిశోధకులు శ్రీచరణ్, నాగభూషణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి రూ.95 లక్షల చెక్కు


చెక్కు అందజేస్తున్న అధికారులు

అనంతపురం క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన అగ్నిమాపకశాఖ ఉద్యోగి కుటుంబానికి ఆ శాఖ, బ్యాంకు అధికారులు రూ. 95 లక్షల ప్రమాద బీమా డబ్బుకు సంబంధించిన చెక్కు శుక్రవారం అందించారు. జిల్లా అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న సుధాకర్ విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మరణించారు. అయితే అగ్నిమాపకశాఖ తమ ఉద్యోగుల ప్రయోజనార్థం బ్యాంక్ ఆఫ్ బరోడాతో ఎంఓయూ చేసుకుంది. మరణించిన ఉద్యోగి సుధాకర్ తన శాలరీ అకౌంట్ బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో ఉండటంతో రూ.95 లక్షల క్లైమ్ అయ్యింది. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును ఆ బ్యాంకు డీజీఎం ప్రసాద్, ఆర్ఎం అమర్‌నాథ్‌రెడ్డి, సాయినగర్ బ్రాంచ్ మేనేజర్ కిరణ్‌కుమార్, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి అసోసియేషన్ సభ్యులు ఉద్యోగి కుటుంబానికి అందించారు.

వాటర్ షెడ్‌తో నీటి సంరక్షణ: ఏపీడీ



జ్ఞాపిక అందుకుంటున్న ఏపీడీ సుధాకర్ రెడ్డి

అనంతపురం అర్బన్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్‌తో నీటి సంరక్షణ సాధ్యమని జిల్లాకి చెందిన ఆ పథకం ఏపీడీ సుధారక్ రెడ్డి పేర్కొన్నారు. వాటర్ షెడ్ అభివృద్ధిలో టెక్నాలజీ వినియోగంపై ఢిల్లీలోని ఎన్ఏఎస్‌సీ కాంప్లెక్స్‌లో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఏపీ నుంచి సుధాకర్ రెడ్డి హాజరయ్యారు. శుక్రవారం రెండో రోజు ఆయన మాట్లాడుతూ.. వాటర్ షెడ్లతో రైతులకు ఎంతో ప్రయోజనం అన్నారు. అనంత జిల్లాతోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వాటర్ షెడ్ల నిర్వహణ తీరును వివరించినట్లు ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో తెలిపారు. ఏపీడీకి సదస్సులో ఉన్నతాధికారులు జ్ఞాపిక అందజేశారు.

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్‌కు నోటీసులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్న వివాదంలో షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్పకు శుక్రవారం నోటీసులు అందించినట్లు తహసీల్దార్ స్వాతి తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. పెనుకొండ మండలం వాసుదేవపురం రెవెన్యూ పొలంలో షిర్డీసాయి గ్లోబుల్ ట్రస్టు పేరుతో భూములు కొనుగోలుచేశారన్నారు. ఆ భూమి మధ్యలో సర్వే నంబరు 25లో 10.24 ఎకరాల్లో రాళ్లగుట్ట ఉందన్నారు. ఇందులో 7.50 ఎకరాలు ట్రస్టు ఆక్రమించుకుందన్నారు. ఇందులోనే 2.88 ఎకరాలు వెంకటలక్ష్మి నుంచి కొనుగోలు చేసినట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారనీ, అందుకు సంబంధించిన రికార్డులు 15రోజుల్లోపు అందించాలని సూచించామన్నారు. వారు స్పందించకపోవడంతో నోటీసులు పంపామన్నారు. ఐదు రోజుల్లో రెవెన్యూ యాక్ట్ ప్రకారం భూమిని స్వాధీనం చేసుకుంటామని నోటీసులో స్పష్టం చేసినట్లు తహసీల్దార్ వివరించారు.

పామిడిలో 25.4 మి.మీ, వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 20 మండలాల్లో గురువారం వర్షం పడింది. అత్యధికంగా పామిడిలో 25.4 మి.మీ వర్షపాతం నమోదైంది. బెళుగుప్ప 22.6, పుట్లూరు 22.2, వజ్రకరూరు 17.2, బ్రహ్మసముద్రం 15.2, బొమ్మనహాళ్ 11.0, ఉరవకొండ 10.2, కళ్యాణదుర్గం 6.8, గుమ్మఘట్ట, నార్పల 4.8, కూడేరు 4.2, మిగతా మండలాల్లో 3.8 మీ.మీ, లోపు వర్షపాతం కురిసింది.

న్యూస్ బాక్స్

ఉత్కంఠభరితంగా క్రికెట్ పోటీలు


క్రికెటర్లకు షీల్డ్ అందజేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో జరుగుతున్న అటల్ బిహారీ వాజ్‌పేయ్ స్మారక క్రికెట్ టోర్నీ సీజన్-2 శుక్రవారం 10వ రోజు ఉత్కంఠ భరితంగా జరిగింది. నాలుగు మ్యాచుల్లో నాలుగుజట్లు పాల్గొని ప్రతిభను చాటాయి. మొదటి మ్యాచ్‌లో రెబల్స్‌స్టార్స్, అర్జున్‌జట్లు తలపడగా 55 పరుగుల తేడాతో రెబల్స్‌స్టార్స్ జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఎగ్రైస్ జట్టు, బీడీపీ యూత్ సూపర్‌కింగ్స్ జట్లు తలపడగా.. 32 పరుగుల తేడా ఎగ్రైస్ జట్టు గెలుపొందింది. మూడో మ్యాచ్‌లో గరుడంపల్లి వారియర్స్, ఇండియన్ లెవెన్స్ సీనియర్స్ కేటీసీ జట్లు మధ్యపోటీ జరగగా.. 10 వికెట్ల తేడాతో ఇండియన్ లెవెన్స్ సీనియర్స్ కేటీసీజట్లు గెలుపొందాయి. నాల్గవ మ్యాచ్‌లో షైట్ వారియర్స్, బాయ్స్ జట్లు తలపడగా.. 58 పరుగుల తేడాతో షైట్ వారియర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ పాల్గొన్నారు.

పోలీసులు సకాలంలో స్పందించారు: ఐఎంఏ

కదిరి అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న డాక్టర్, సిబ్బందిపై జరిగిన దాడికి సంబంధించి పోలీసులు సకాలంలో స్పందించారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కదిరిలో వారు విలేకరులతో మాట్లాడు తూ.. బుధవారం రాత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో ఇరువర్గాల మధ్య ఘర్షణకు స్పందించి పోలీసులు స్పందించిన తీరు అభినందనీయం అన్నారు. సీఐ నారాయణరెడ్డి, సిబ్బందితో ఆసుపత్రికి చేరుకుని అల్లరి మూకలను అదుపులోకి తీసుకున్న తీరుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను త్వరగా పరిష్కరించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ధన్యావాదాలు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలో పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎంఏ కదిరి శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఆజాద్, భాస్కర్‌నాయక్, సభ్యులు విద్యాసాగర్, శ్రీనివాసులు, ప్రసాద్, జానకీరాం, చంద్రశేఖర్‌రెడ్డి, మధన్‌కుమార్, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● వైద్యసిబ్బందిపై దాడికి ఖండన

కదిరి : విధినిర్వహణలో ఉన్న వైద్యులు, సిబ్బందిపై తాగుబోతులు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కదిరి శాఖ అధ్యక్షుడు షక్రుద్దీన్, ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ శుక్రవారం పేర్కొన్నారు. వైద్యులు, ఇతర సిబ్బందిపై దాడిచేయడం అమానుష చర్య అన్నారు. అందుకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి స్పెషల్‌గ్రాంట్ రూ.2 కోట్లు, డీఎంఎఫ్ నిధులు రూ.6.75 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక చొరవతో పురపాలకశాఖ మంత్రి నారాయణ ఈ నిధులను విడుదల చేశారని తెలిపారు. ఈ నిధులను మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా, రోడ్లు, కాలువల నిర్మాణం, వీధిలైట్లు, పార్కుల అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు వివరించారు. వెస్ట్‌గేట్ రోడ్డునిర్మాణానికి సంబంధించి విమానాశ్రయం నుంచి పెద్దకమ్మవారిపల్లి ఎక్స్‌రోడ్డు వరకు, ఎమ్మార్వో కార్యాలయం నుంచి బ్రాహ్మణపల్లి, బీడుపల్లి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వరకు రోడ్డు నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు

ధర్మవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా నియంత్రణ కోసం కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జ్వాలాపురం వద్ద జాతీయ రహదారి పక్కన ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. చెక్‌పోస్ట్ ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు పనిచేస్తుందన్నారు. చెక్‌పోస్టులో రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా విధులు నిర్వహిస్తారమని అన్నారు. అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి ఇసుక రవాణా చేస్తున్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంగన్‌వాడీల కమిటీ ఎన్నిక


విజయలక్ష్మి, దీన

ధర్మవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ధర్మవరం అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కమిటీని జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. శుక్రవారం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అంగన్‌వాడీల సమావేశాన్ని నిర్వహించారు. ధర్మవరం అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలిగా విజయలక్ష్మీ, కార్యదర్శిగా దీన, కోశాదికారిగా అరుణ, ఉపాధ్యక్షురాలుగా బీబీ, పాతిమా, సహాయకార్యదర్శులుగా గంగరత్న, రాధాను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌హెచ్ బాషా, జేవీ రమణ, అయూబ్‌ఖాన్, ఆదినారాయణ, హైదర్‌వలీ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టిన దృశ్యం

నల్లమాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్నికోటకు చెందిన నరసింహులు బోరుబావి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలకొట్టి కాపర్ వైర్‌ను చోరీ చేసినట్లు చెప్పారు. తనకు న్యాయంచేయాలని రైతు కోరారు.

రైతు సేవాకేంద్రానికి చేరిన యూరియా

గాండ్లపెంట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సోమయాజులపల్లిలో రైతు సేవా కేంద్రానికి యూరియా చేరినట్లు ఏఓ షాదాబ్ శుక్రవారం తెలిపారు. సోమయాజులపల్లి రైతు సేవా కేంద్రంలో సుమారు 200 బ్యాగుల యూరియా అందుబాటులో ఉందని, కావలసిన రైతులు తీసుకుని వెళ్లాలన్నారు. మిగిలిన రైతు సేవా కేంద్రాల్లో త్వరలో యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు.


రైతులకు యూరియా అందిస్తున్న సిబ్బంది

ఉత్సాహంగా గణనాథుడి నిమజ్జనం




గాండ్లపెంటలో వినాయక విగ్రహాల ఊరేగింపు, నంబులపూలకుంట మండలం గోవిందురాజుపల్లిలో సందడి, తనకల్లులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

గాండ్లపెంట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో కొలువుదీరిన గణనాథులను శుక్రవారం నిమజ్జనం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మూడవరోజు వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఆయాగ్రామాల సమీపంలోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.

●నంబులపూలకుంట : గణనాథులను ప్రత్యేకంగా ఊరేగించి నిమజ్జనానికి తరలించారు. గోవిందురాజుపల్లిలో వినాయకుడి వద్ద ఉంచిన లడ్డును రంగంరెడ్డి, ఇరగంరెడ్డి రూ.2 లక్షల 65వేలకు దక్కించుకున్నారు.

● తనకల్లు : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో 55 వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. సీజీ ప్రాజెక్టులో పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఏర్పాట్లను రూరల్ సీఐ నాగేంద్ర పరిశీలించారు.

● నల్లమాడ : మండలంలోని నల్లశింగయ్యగారిపల్లిలో కొలువుదీరిన వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విగ్రహాలను డప్పుల మధ్య ఊరేగించారు. యువత కేరింతలు కొడుతూ రంగులు చుట్టుకున్నారు.

● బత్తలపల్లి: మండలవ్యాప్తంగా వినాయక నిమజ్జ వేడుకలు ఘనంగా జరిగాయి. వాడవాడల వెలసిన గణనాథుడి ప్రతిమలను నిమజ్జనం చేశారు. బత్తలపల్లిలో మంజుల నాగేష్ అన్నదానం నిర్వహించారు.

● ముదిగుబ్బ : మండలంలో ఏర్పాటు చేసిన విగ్రహాలను మూడు రోజులు పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు.


ఓడీసీలో లడ్డూ దక్కించుకున్న భక్తులు

● ఓబుళదేవరచెరువు: మండలంలోని బుచ్చిరాజుపల్లిలో వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డును ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వే లం నిర్వహించారు. ఈ వేలంలో శెట్టివారి కుటుంబ సభ్యులు రూ. 2 లక్షల వెయ్యికి దక్కించుకున్నారు. వినాయక విగ్రహాన్ని ఊరేగించి, నిమజ్జనం చేశారు.

నిమజ్జనంలో అపశృతి

● నల్లచెరువు : మండలంలోని చెరువువాండ్లపల్లి వద్ద మండల కేంద్రానికి చెందిన శ్రీవాసవి మాత యూత్ ఆధ్వర్యంలో వినాయ నిమజ్జనంచేస్తుండగా అపశృతి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చెరువువాండ్లపల్లిలో వినాయ నిమజ్జనం చేస్తుండగా, నల్లచెరువుకు చెందిన రోహిత్ ప్రమాదశాత్తు చెరువులో మునిగిపోయాడు. గ్రామస్తుల సాయంతో చెరువులోనుంచి బయటకు తీసి నల్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కదిరికి తర్వాత అనంతపురం ఆసుపత్రికి తరలించారు.


నల్లమాడ మండలం నల్లశింగయ్యగారిపల్లి, బత్తలపల్లి, ముదిగుబ్బలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు

సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్‌కు అటానమస్

కళాశాల చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ అటానమస్ గుర్తింపు లభించిందని కళాశాల చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలకు పది సంవత్సరాలు పాటు అటానమస్ హోదాను ఇస్తూ ఉత్వర్వులు వచ్చాయని పేర్కొన్నారు. ఇది తమ కళాశాలకు ఎంతో గర్వకారణం అని తెలిపారు. కళాశాల ప్రారంభించిన అతికొద్ది సమయంలోనే నాక్ ఏ గ్రేడ్ ఉత్తీర్ణత యూజీసీ అటానమస్ పొందిన ఏకైక కళాశాలగా జిల్లాలో నిలవడం అద్భుతమైన విజయం అన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి, నిబద్ధతకు నిదర్శనంగా తమ కళాశాల నిలుస్తుందన్నారు. బోధన, అభ్యాసన పద్ధతుల్లో నూతన ఒరవడిని తీసుకొచ్చిందన్నారు. ఈ విజయానికి దోహదం చేసిన పూర్వవిద్యార్థులు, తల్లిదండ్రులు, ప్లేస్‌మెంట్ రిక్రూటర్స్‌కు ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హేమచంద్ర పేర్కొన్నారు. కళాశాలలో విద్యాప్రమాణాలు, పరిశోధన కార్యక్రమాలు, పరిశ్రమ సహకారాన్ని మరింత మెరుగుపరచుకోవడానికి ఈ కొత్త హోదా ఉపయోగపడుతుందన్నారు. ఈ గుర్తింపుతో సాంకేతిక విద్యలో కొత్తప్రమాణాలను నిర్దేశించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ఇంజనీర్లను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు డైరక్టర్ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు.

క్రీడాకారులను అభినందించిన జేసీ



మొమెంటో ఇస్తున్న జేసీ అభిషేక్‌కుమార్, కాకతీయ విద్యానికేతన్‌లో చెస్ ఆడుతున్న విద్యార్థులు, నల్లమాడలో క్రీడలు ఆడుతున్న విద్యార్థులు

ధర్మవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఈనెల 18, 19 తేదీలలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ జోనల్ స్థాయి పోటీలలో ధర్మవరం బాలికలు ప్రతిభ కనబరచి ద్వితీయస్థానంలో నిలిచినట్టు ఉమ్మడి జిల్లా బాస్కెట్ బాల్ అసోషియేషన్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్‌బాస్కర్ మెమోంటోలు, మెడల్స్‌తో ఘనంగా సత్కరించారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ జాతీయ క్రీడాదినోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించి గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నిర్మలాదేవి, పాఠశాల డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, పద్మ పాల్గొన్నారు.

● నల్లమాడ : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడాపోటీల దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. పలురకాల కీడ్రాపోటీలు నిర్వహించి, ప్రతిభకనబరచివారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

● కదిరిఅర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, ఈడీ నరసింహాచారి, అధ్యాపకులు ఆదినారాయణ, నారాయణస్వామి, సుందరమోహన్‌రెడ్డి, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఆలయంపై పడిన చెట్టు

గోడలకు నెర్రెలు.. కూలుతుందని భక్తుల ఆందోళన

తనకల్లు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పురాతన అంజనేయస్వామి ఆలయంపై గురువారం రాత్రి కురిసిన వర్షానికి చెట్టు విరిగి పడింది. దీంతో ఆలయానికి గతంలో ఏర్పాటు చేసిన బండలు పలిగి నెర్రెలు చీలాయి. ఈ కారణంతో ఆయలం ఎప్పుడైనా కూలిపోవచ్చని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆలయంలో నవగ్రహాల విగ్రహాలు ఉన్నాయి. దీంతో నిత్యం ఆలయానికి భక్తులు వస్తుంటారు. ఆలయంలోనే పెద్ద వేపచెట్టు ఎన్నో ఏళ్లుగా గుడి లోపల నుంచి పైకి పాకింది. శుక్రవారం ఆలయానికి వెళ్లిన భక్తులు ఈ విషయాన్ని గుర్తించి లోపలికి వెళితే ప్రమాదం ఉన్నట్లు చెప్పారు. ఆలయం కూలితే లోపల ఉన్న విగ్రహం దెబ్బతింటుదని, వెంటనే అధికారులు స్పందించి కొమ్మలను తొలగించే ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.


నెర్రెలు చీలిన ఆంజనేయస్వామి ఆలయం, ఆలయంపై పడిన చెట్టు కొమ్మ

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

ధర్మవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుబాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు మల్లికార్జునను సన్మానించారు. ప్రిన్సిపాల్ ప్రశాంతి మాట్లాడుతూ..తెలుగుభాష ఔన్నత్యాన్ని, తెలుగుభాషకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన సేవను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు బాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సీనియర్ తెలుగు పండితులు జయసింహ, పీడీ ఉద్యోగాలకు ఎంపికైన రామకోటి, నాగార్జున, మల్లేశు, ప్రతాప్‌లను లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పిట్టా వెంకటస్వామి, రమేశ్‌బాబు, నాగేంద్ర, వెంకటేశ్, పల్లెం వేణుగోపాల్, రాధాకృష్ణ, వేణుగోపాలాచార్యులు, రాజీవ్ పాల్గొన్నారు. ఉషోదయ పాఠశాలలో తెలుగుబాషా దినోత్సవాన్ని ఘ నంగా జరుపుకున్నారు. తెలుగు పండితులు నాగశేషు, నాగభూషణంను కరస్పాండెంట్ చాంద్‌బాషా, డైరెక్టర్లు షంషాద్‌బేగం, పోలా ప్రభాకర్, సుబ్బారావు ఘనంగా సత్కరించారు. రిషి పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ్‌స్వరూప్‌సింగ్, సీఈఓ రవీంద్ర, ఏఓ రంగారెడ్డి పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్ : పట్టణంలోని శాంతినికేతన్, హరీష్ పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. కరస్పాండెంట్లు మోమిన్ సలీంబాషా, ఎంఎస్ కిరణ్ పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్ : గిడుగు రామ్మూర్తి జయంతిని నాగలూరు వద్ద ఉన్న రూపరాజా పీసీఎంఆర్ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. అదేవిధంగా జాతీయక్రీడదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ రూపరాజకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


ధర్మవరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ఉషోదయ స్కూల్, పీసీఎంఆర్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం

ఉత్తమ కండక్టర్‌కు అభినందనలు


రామక్రిష్ణను అభినందిస్తున్న డీఎం మైనోద్దీన్ తదితరులు

కదిరిఅర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కదిరి డిపోలో పనిచేస్తున్న జి.రామక్రిష్ణ ఉత్తమ కండక్టర్‌గా ఎంపికయ్యారు. 2024-25లో అత్యధిక ఆదాయం కిలోమీటర్‌కు రూ.56.32 చొప్పున తెచ్చి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్‌నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కదిరి డిపో కార్యాలయంలో మేనేజర్ మైనోద్దీన్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ పెద్దన్న, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ నాయకులు అభినందించారు. అత్యధిక ఆదాయం తెచ్చి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవడం ఆయన పనితీరుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయుఏ నాయకులు బైరిశెట్టి, రవినాయక్, సిబ్బంది బాలునాయక్, క్రిష్ణయ్య, నబీరసూల్, షామీర్‌బాషా పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న కండక్టర్

ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆమెకు అందించి నిజాయతీని చాటుకున్న కండెక్టర్. శుక్రవారం కదిరి నుంచి మదనపల్లికి వెళ్లే బస్సులో శంకరమ్మ అనే ప్రయాణికురాలు బస్సు ఎక్కింది. వేపూరికోటలో సెల్ మరిచిపోయి దిగి వెళ్లింది. గమనించిన కండక్టర్ హరికుమార్ సెల్‌ను తన దగ్గర ఉంచుకుని తిరుగు ప్రయాణంలో ప్రయాణికులికి అందించారు. ఆయను ప్రయాణికులు, డిపో మేనేజర్ మైనోద్దీన్ అభినందించారు.

యూరియా కొరత తీర్చండి


ప్రత్యేకాధికారికి వినతి పత్రం ఇస్తున్న కొండకమర్ల రైతులు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమర్ల 1,2 సచివాలయంలోని రైతులకు యూరియా కొరత తీర్చాలని ఆ ప్రాంత రైతులు నాగభూషణంనాయక్, ఇడగొట్టు అంజనేయులు, రామచంద్ర, నరేష్ తదితరులు శుక్రవారం ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, ఎంపీడీఓ శివరాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. రైతులు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి యూరియా చేరిందని, కొండకమర్ల పంచాయతీకి సరఫరా కాలేదని పేర్కొన్నారు. దీంతో ఎరువుల దుకాణాల్లో కృత్రిమ కొరత వల్ల స్టాక్‌లేదని అదనపు ధరలకు అమ్ముతున్నట్లు ఆవేదన చెందారు. అధికారులు స్పందించి యూరియా కొరతతీర్చాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన ఖలీల్

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెయిన్‌బో పాఠశాల సమీపంలో కదిరి, హిందూపురం ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో వర్కర్‌గా పనిచేస్తున్న లక్ష్మీనాయక్, అతడి మిత్రుడు ఖలీల్ ద్విచక్రవాహనంలో మండలలోని సున్నంపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా హైవేపై ఉంచిన స్టాపర్లను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా.. 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వేలం పాటను రద్దు చేయాలి

● కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్.. ఆమోదిస్తూ తీర్మానం


మాట్లాడుతున్న కౌన్సిలర్ నారాయణరెడ్డి

ధర్మవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో రెండు రోజుల క్రితం నిర్వహించిన కాంప్లెక్స్ రూముల వేలంపాటను రద్దు చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, జేసీబీ రమణ, సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ... ఇటీవల నిర్వహించిన మాలగుండ్ల పెదయ్య మున్సిపల్ కాంప్లెక్స్‌లో 1వ నెంబరు రూముకు సంబంధించి నిర్వహించిన వేలం పాటలో కేవలం రూ.10.25 లక్షలకు అమర్ అనే వ్యక్తికి గుడ్‌విల్ పద్ధతిన కట్టబెట్టడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఈ దుకాణ సముదాయంలో ఒక్కో దుకాణం రూ.30లక్షల నుంచి రూ.50 లక్షల దాకా గుడ్‌విల్ పద్ధతిన ఇతర వ్యాపారులు దక్కించుకున్నారని అన్నారు. కాయగూరల మార్కెట్‌లో కూడా గతంలో రూ.9లక్షలు గుడ్‌విల్‌కు ఇతర వ్యాపారులు పాట పాడి దుకాణాలను దక్కించుకుంటే.. ఇప్పుడు అధికారులు రహస్య వేలం పాట ద్వారా కేవలం రూ.5.30 లక్షలకే కట్టబెట్టడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. స్పందించిన చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ కమిషనర్‌ను వివరణ కోరగా నిబంధనల మేరకే వేలం పాట నిర్వహించామని సమాధానం చెప్పారు. దీంతో ఆగ్రహించిన చైర్‌పర్సన్ ఆ వేలం పాటను రద్దు చేస్తూకౌన్సిలర్లు తీర్మానం చేయడంతో ఆ తీర్మానాన్ని చైర్‌పర్సన్ ఆమోదించారు. మళ్లీ పారదర్శకంగా వేలంపాట నిర్వహించాలని చైర్ పర్సన్ తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్ షంషాద్‌బేగం, అధికారులు పాల్గొన్నారు.

పరిటాల రవి జయంతికి తరలిరండి

ధర్మవరం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతి వేడుకలను విజయవంతం చేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, జిల్లా అధికారప్రతినిధి పురుషోత్తంగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం గాంధీనగర్ టీడీపీ కార్యాలయంలో ఉదయం 9గంటలకు పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. అనంతరం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

తాగునీటి మోటారు ఏర్పాటు

కదిరి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చిత్రావతి రిజర్వాయర్ నుంచి కదిరికి నీరు అందించే పైపులైన్‌లో దొరిగిల్లు వద్ద చెడిపోయిన మోటారు స్థానంలో నూతనంగా ఏర్పాటు చేసినట్లు చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో తాగునీటికి తరచూ అంతరాయం ఏర్పడుతోందని, దొరిగిల్లు పంపుహౌస్ వద్ద ఒక మోటారు కాలిపోవడంతో ఇబ్బందులు పడేవారమని అన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచన మేరకు రూ.6లక్షల 50వేలతో నూతన మోటారును ఏర్పాటు చేశామని వివరించారు. శనివారం నుంచి దొరిగిల్లు పంపు హౌస్‌నుంచి రెండు మోటార్లు నిరాటకంగా పనిచేస్తాయని తెలిపారు. పట్టణ ప్రజలకు వార్డుల వారీగా తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. మోటార్లు అమర్చడానికి కమిషనర్ కిరణ్‌కుమార్, సిబ్బంది సకాలంలో సహకరించారని అన్నారు.


మోటారును ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

న్యూస్ బాక్స్

యూరియా కోసం రైతుల ఆందోళన



కోడిపల్లిలో యూరియా కోసం ఆందోళన చేస్తున్న రైతులు

అగళి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా సరఫరా చేయాలని కోడిపల్లి గ్రామ సచివాలయం ఎదుట శుక్రవారం రైతులు ధర్నా చేపట్టారు. రైతులు మాట్లాడుతూ యూరియా వల్ల వరి అధిక దిగుబడి వస్తుందని, యూరియా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఎరువుల దుకాణంలో కూడా ఎక్కడా లేదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలానికి యూరియా వచ్చేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

మడకశిర టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిందూపురం ప్రధానరహదారిలో 4, 7 వార్డులకు చెందిన మహిళలు శుక్రవారం తాగునీటి సమస్య పరిష్కరించాలని రోడ్డెక్కారు. దాదాపు ఒక గంట పాటు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రెండు నెలల నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే మురుగు నీరు ఇళ్లముందుకు చేరుతున్నాయని ప్రస్తుతం డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినికి జేసీ ప్రశంస



సుకన్యకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జేసీ

రొద్దం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నారనాగేపల్లి గ్రామానికి చెందిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి సుకన్య జాతీయస్థాయిలో పోటీల్లో పాల్గొన్నందుకు జేసీ అభిషేక్ కుమార్ ప్రశంసా పత్రం, మెడల్‌ను అందించి అభినందించారు. శుక్రవారం పుట్టపర్తిలో నిర్వహించిన క్రీడాకారులందరికి ప్రశంసా పత్రాలు అందజేశారు. 2024లో రొద్దం మండలం నారనాగేపల్లి జడ్పీ పాఠశాలలో 10తరగతి చదివిన విద్యార్థిని సుకన్య మహారాష్ట్రంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. పీఈటీ మహేష్, సాఫ్ట్‌బాల్ కోచ్ లక్ష్మీలను కలెక్టర్ అభినందించారు.

ఎంజీఎం పాఠశాలకు అవార్డు



జేసీ నుంచి అవార్డు అందుకుంటున్న హెచ్ఎం రంగనాయకులు

హిందూపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంజీఎం పాఠశాలకు క్రీడా అవార్డు వచ్చినట్లు పీడీ లోకనాథ్, హెచ్ఎం రంగనాయకులు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో 2023-24విద్యాసంస్థల్లో ఎంజీఎం పాఠశాల క్రీడల్లో కనబరచిన ప్రతిభను గుర్తించి అవార్డు అందించారన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ చేతులమీదుగా హెచ్ఎం రంగనాయకులు, పీడీ లోకనాథ్ అవార్డు అందుకున్నారు. పీడీలు విలియమ్స్, రాణి, ప్రవీణ్, మొరార్జియాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు విద్యార్థి ఎంపిక



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయుడు

పావగడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు విద్యార్థి సాయి ఎంపికైనట్లు ఉపాధ్యాయుడు తిప్పేస్వామి తెలిపారు. జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ పోటీలను మదుగిరి జిల్లా విద్యాశిక్షణ సంస్థ ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఇందులో పావగడ వీఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థి వెంకట్ క్వాంటం ఏజ్ బిగిన్స్ విత్ పాసిబిలిటీస్ అండ్ బెనిఫిట్స్ అనే సైన్స్‌సెమినార్ టాపిక్‌లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. దీంతో వెంకట్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

లేపాక్షి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి క్రీడలపై అవగాహన కల్పించారు. చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం తెలుగు భాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

హిందూపురం: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హిందూపురంలోని పాంచజన్య బ్రిలియన్స్ హైస్కూల్‌లో విద్యార్థులు స్పోర్ట్స్ డే ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. పాఠశాల అధ్యక్షుడు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు.

సీఐ సురేష్‌ను సస్పెండ్ చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న న్యాయవాదులు

పావగడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పావగడ సీఐ సురేష్‌ను సస్పెండ్ చేయాలని తాలూకా బార్‌అసోసియేషన్ తరఫున లాయర్లు శుక్రవారం పెద్దఎత్తున నిరసన తెలిపారు. స్థానిక మున్సిఫ్ కోర్టు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వస్తూ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని సీఐ సురేష్ వేసిన అక్రమ కేసులు తొలగించి న్యాయవాది సుధాకర్‌కు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు

● పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు
● ఆందోళనలో రైతన్నలు



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. దీనిపై పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని తిమ్మాపురం రైతులు వాపోతున్నారు. రైతులు శ్రీనివాసులు, రాజు మాట్లాడుతూ పాత జాతీయరహదారి నుంచి వ్యవసాయ పొలాల్లోకి వెళ్లాలంటే వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, వాటికి స్తంభాలు ఏర్పాటుచేసి సరిచేయాలని వేడుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇటీవల గ్రామంలో మృతదేహాన్ని ఖననం చేసేందుకు తీసుకెళ్లే సమయంలో కూడా కట్టెలతో తీగలను ఎత్తి పట్టుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి తీగలను సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఏ విచారణకైనా సిద్ధం

● వైసీపీ కౌన్సిలర్లకు చైర్మన్ రమేష్ సవాల్

హిందూపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవల జరిగిన మురుగు కాలువల పూడికతీతలో ఏవిచారణకైనా సిద్ధమని మున్సిపల్ చైర్మన్ రమేష్ సవాల్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. వైసీపీ కౌన్సిలర్ శివ మాట్లాడుతూ పూడికతీతపనుల్లో రూ.80లక్షలు అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఇందులో ఎవరెవరికి వాటాలు అందాయో అంటూ చెప్పడంతో చైర్మన్ స్పందిస్తూ కాలువ పూడికతీత పనుల్లో అక్రమాలు జరిగాయని నిరూపిస్తే ఏ విచారణకైనా సిద్ధమన్నారు. మీకు అనుకూల పత్రికల్లో వార్తలు వచ్చాయని ఏదో జరిగిపోయిందని మాట్లాడటం సరికాదన్నారు. దీనిపై కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.30లక్షలకు సంబంధించిన బిల్లులు మాత్రమే ఇచ్చారని, అదికూడా కాలువలో పూడికతీతకు ముందు, తరువాత జియోట్యాగింగ్ ద్వారా ఫొటోలు తీశామన్నారు. రూ.30లక్షలు పనులు జరిగితే రూ.80లక్షలు అక్రమాలు ఎలా జరిగాయని ఆయన ప్రశ్నించారు. లోకాయుక్తకు ఫిర్యాదు చేశారుకానీ దానిని తోసిపుచ్చారన్నారు. చైర్మన్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో గడప గడపకు కార్యక్రమంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఒక్కొక్కరి బిల్లులే చెల్లిస్తూ వారిలో ధైర్యం నింపుతూ పనులు చేయడానికి ఒప్పిస్తున్నారన్నారు. మార్కెట్‌లో చాలావరకు ఖాళీగదులున్నాయని అయితే గతంలో ఎక్కువ మొత్తంలో వేలంలో గదులు దక్కించుకున్నారన్నారు. మరోసారి వేలం పెట్టాలని డిమాండ్ చేశారు. వైసీపీ, టీడీపీ సభ్యుల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం అజెండాలోని అంశాలను ఆమోదిస్తూ సమావేశం ముగించారు.



టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం

పింఛన్లపై అవాస్తవాలు నమ్మకండి

లేపాక్షి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్ తొలగించిందని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని అటువంటి అవాస్తవాలు నమ్మవద్దని మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎవరికీ పింఛన్ తొలగించలేదని కేవలం వెరిఫికేషన్ కోసం మాత్రమే పత్రాలను సరిచూసేందుకే నోటీసులు పంపామన్నారు. నోటీసులు వచ్చిన వారు అధికారులవద్దకు వచ్చి వారి సరైన సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. గతంలో జారీచేసిన వికలాంగత్వానికి ప్రస్తుతం ఉన్న వికలాంగత్వానికి వ్యత్యాసం ఉంటే పింఛన్ కొంతమేర తగ్గే అవకాశం ఉందితప్పా పూర్తిగా రద్దుచేయలేదన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు యూటీఎఫ్ సమావేశం

పరిగి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలశాఖ తరఫున ఆడిట్ కమిటీ అధ్యక్షతన ప్రధాన కార్యదర్శి సుల్తాన్ హఫీజ్‌ఖాన్, హనుమంతప్ప ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. కన్వీనర్ మహంతేజ్ మాట్లాడుతూ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సేవామందిరం పరిగి యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో మధ్యంతర కౌన్సిల్ ఏర్పాటు చేశామన్నారు. సత్యసాయి జిల్లా నుంచి అన్ని మండలాల నుంచి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కమ్యూనిటీ వైద్యశాల తనిఖీ

రొళ్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ వైద్యశాలను శుక్రవారం ఆసుపత్రి కమిటీ సభ్యుడు రమేష్‌గౌడ్ తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత, ఓపీ రిజిస్టర్‌లో రోగుల సంఖ్య, అందుబాటులో ఉన్న మందుల వివరాలను సూపరింటెండెంట్ రమేష్‌నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులోఉన్న రోగులను పలకరించి వారికి అందిస్తున్న చికిత్స గురించి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

మడకశిర రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రైతులు పంటసాగులో శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత రామసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని సీ రంగాపురం, మల్లినాయకునిపల్లి, గౌడనహళ్లి గ్రామాల్లో రైతులు సాగుచేసిన వేరుశనగ, కంది, పత్తి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లడుతూ ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తేమ, చల్లదనంతో పత్తి పంటకు బూడిద తెగులు వచ్చినట్లు తెలిపారు. సాగుచేసిన పంటలకు వచ్చే తెగుళ్ల, వాటి నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుడిబండ: వ్యవసాయ సాగులో అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏఓ వీరనరేష్‌లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాళ్లపల్లి, శంకరగల్లు గ్రామాల్లో రైతుల సాగుచేసిన పంట పొలాలను పరిశీలించారు. రైతు సేవాకేంద్రం సిబ్బంది కవితమ్మ, రైతులు, మంజు, మూర్తి, రఘు, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

వంట సామగ్రి వితరణ

గుడిబండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మడలంలోని మైనగానిపల్లి గ్రామానికి చెందిన జ్ఞానరక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వరప్రసాద్ శుక్రవారం గుడిబండ ఎంజేపీ పాఠశాలకు వంట సామగ్రి, విద్యార్థినులకు ఆట వస్తువులు అందించారు. ప్రిన్సిపాల్ మంజుళ, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

నిమజ్జనానికి సహకరించండి: ఎస్ఐ

సోమందేల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి ప్రజలు సహకరించాలని ఎస్ఐ రమేష్ కోరారు. శుక్రవారం ఇందిరానగర్‌లో ప్రతిష్ఠించిన గణేషున్ని దర్శించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. నిమజ్జనానికి వినియోగించే వాహనాల్లో పిల్లలు, మహిళలను ఎక్కించరాదన్నారు. సమయపాలనను పాటించాలన్నారు. నిమజ్జనం ప్రారంభంకాగానే పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని, నిర్ణీత సమయంలో నిమజ్జనం పూర్తి చేయాలన్నారు.

పరిటాల విగ్రహావిష్కరణకు తరలిరండి



రొద్దంలో సమావేశమైన టీడీపీ నాయకులు

రొద్దం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరిగే పరిటాల రవి కాంస్య విగ్రహావిష్కరణకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని టీడీపీ కన్వీనర్ నరహరి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పరిటాల రవీంద్ర 67వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో శనివారం ఉదయం 10గంటలకు కాంస్య విగ్రహం ఆవిష్కరిస్తారన్నారు. మంత్రి సవిత ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, అశ్వత్థనారాయణ, మారెప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు వీరాంజనేయులు, బైలర్ ఆంజనేయులు, డైరెక్టర్ తిరుపాల్‌నాయుడు, వాల్మీకి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోరంట్ల (ఆంధ్రజ్యోతి): పెనుకొండలో శనివారం పరిటాల రవీంద్ర కాంస్యవిగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సోముశేఖర్, నిమ్మల చంద్రశేఖర్, నాగేనాయక్, తిరుపాల్, జయచంద్ర, రమణ, రవిమోహన్, వేణు, జయరాం, నరసింహులు పాల్గొన్నారు.

సోమందేల్లి(ఆంధ్రజ్యోతి): పరిటాల రవీంద్ర 67వ జయంతి పురస్కరించుకుని పెనుకొండ పట్టణంలోని దర్గాసర్కిల్‌లో ఏర్పాటు చేయనున్న కాంస్య విగ్రహావిష్కరణకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కన్వీనర్ వెంకటేశులు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

పరిగి(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెనుకొండకు తరలిరావాలని మండల కన్వీనర్ గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రవీణ్‌రెడ్డి, సర్పంచ్ బాలాజీ, సంజీవరాయప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యవహారిక భాషా ఉద్యమకారుడు గిడుగు

● ప్రిన్సిపాల్ సుదర్శన్



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

పెనుకొండ, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): వ్యవహారిక భాషా ఉద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ అన్నారు. శుక్రవారం గిడుగు రామ్మూర్తి జయంతిని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అధ్యాపకులు హఫీజ్, బషీర్, ఎన్ఎస్ మూర్తి, రామారావు, సుధారాణి, రాజగోపాల్, స్రవంతి, ఎన్ఎస్ఎస్ పీఓలు శివన్న, రవికుమార్, శ్రీలేఖ పాల్గొన్నారు. సత్యసాయి కళాశాలలో ఏఓ కేశవయ్య ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. తెలుగు అధ్యాపకుడు మంజునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజేపీ జూనియర్ కళాశాలలో శుక్రవారం తెలుగుభాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే బషీరున్నీసా మాట్లాడుతూ భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఎస్‌వైఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అధ్వర్యంలో నిర్వహించారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి పాటుపడదామని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వైస్ చైర్మన్ బలరాంరెడ్డి, జబీవుల్లా, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన తెలుగు బాషా దినోత్సవంలో ప్రిన్సిపాల్ ప్రగతి మాట్లాడుతూ గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకురావాలని ఉద్యమాలు చేసి తెలుగు సాహిత్య వైతాళికుడుగా పేరొందిన గిడుగు వెంకటరామూర్తిని తెలుగువారు గుర్తుచేసుకోవాలన్నారు. పాంచజన్య బ్రిలియన్స్ పాఠశాలలో తెలుగుభాష దినోత్సవం సందర్భంగా చిన్నారులు పలు వేషధారణలతో ఆకట్టుకున్నారు.

అమరాపురం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, కస్తూర్బా ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం వేడుకలను నిర్వహించారు. అనంతరం సాహిత్య వైతాళికుడు, తెలుగుభాష శాస్త్రవేత్త గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు.



మడకశిరలో నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

వైభవంగా నిమజ్జనం

వినాయకచవితి సందర్భంగా పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను శుక్రవారం మూడో రోజు భక్తులు పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. యువకులు కేరింతలు కొడుతూ, రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. పెనుకొండలోని భోగసముద్రం చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



పెనుకొండ(రూరల్): గుట్టూరులో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు



పెనుకొండ: భోగసముద్రం చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



రొద్దంలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు




చిలమత్తూరులో నిమజ్జనోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పూజలందుకుంటున్న గణనాథులు



మడకశిర టౌన్, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యల వద్ద శుక్రవారం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిరెడ్డిపాళ్యం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, ఆపార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, కౌన్సిలర్లు ఉమాశంకర్, తిమ్మరాజు పాల్గొన్నారు.



పావగడ(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా కొలువుతీరిన వివిధ రూపాల్లో ఉన్న గణనాథులకు చిన్నారులు, యువకులు పూజలు చేసి భక్తిని చాటుకున్నారు.

సోమందేల్లి(ఆంధ్రజ్యోతి): వాడవాడలా వెలసిన వినాయకుడికి శుక్రవారం విశేషపూజలు నిర్వహించారు. పట్టణంలోని ఇందిరానగర్, సప్తగిరికాలనీ, దుర్గానగర్, వినాయకనగర్, నక్కలగుట్ట తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణనాథులను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.



పరిగి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పరిగి ఇందిరమ్మ కాలనీలో రౌడీ వినాయక విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. యువకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం: జడ్పీటీసీ



రైతులకు దాణా పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ ఉమేష్

అగళి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జడ్పీటీసీ ఉమేష్ అన్నారు. స్థానిక పశువైద్యశాఖ కార్యాలయంలో శుక్రవారం పాడి రైతులకు దాణా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 80మంది పాడిరైతులకు దాణా వచ్చిందని, 70మంది రైతులకు పంపిణీ చేశామన్నారు. మిగిలిన దాణా బస్తాలను అందిస్తామన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ శివకుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు కుమారస్వామి, మండల అధ్యక్షుడు మధూడి తిప్పేస్వామి, ఎంపీపీ రేణుక, కామరాజ్, వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.